**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 43, పేజీలు - 08

శనివారం, ఆగష్టు 8, 2026 వెల: 5 రూ/.






# కల్తీని కట్టడి చేయాల్సింది పోయి..

# జర్నలిస్టులపై కేసులా?



- కల్తీ పన్నీర్‌పై పోరాటం చేస్తే.. పోలీస్ స్టేషన్‌లో నిర్బంధమా.?
- కల్తీ మాఫియాకు అండ ఎవరిది.? జర్నలిస్టులపై పోలీసుల ఉక్కుపాదం ఎందుకు.?
- అక్రమాలను ప్రశ్నిస్తే నేరమా.? జర్నలిస్టుల గొంతు నొక్కే ప్రయత్నమా.?
- కల్తీ పన్నీర్‌ను పట్టించేందుకు వెళ్తే.. రిపోర్టర్లపైనే కేసులా.?
- కల్తీ దందాపై సమాచారం ఇచ్చిన జర్నలిస్టులకు పోలీసుల వేధింపులా.?
- కల్తీ వ్యాపారులపై చర్యలు ఎక్కడ.? ప్రశ్నించిన జర్నలిస్టులపైనే కొరడా!
- ప్రజల ఆరోగ్యం కోసం పోరాడితే.. పోలీస్ స్టేషన్‌లో గంటల తరబడి కూర్చోబెట్టడమా.?
- కల్తీని అడ్డుకునే జర్నలిస్టులకే అడ్డంకులు, ఓయూ పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు
- కల్తీ మాఫియాను కాపాడుతున్నారా.? జర్నలిస్టులనే నిందితులుగా చేస్తున్నారా.?

**"ఉస్మానియా పోలీస్ స్టేషన్ పరిధిలోని హబ్సిగూడ స్ట్రీట్ నెంబర్ 8 లో ఓ మిల్క్ షాపుకు కల్తీ సరఫరా అవుతున్నట్లు పన్నీర్ ప్యాకింగ్ అవుతున్నట్లు జర్నలిస్టులకు సమాచారం అందింది. ఇన్ఫర్మేషన్ ను కన్ఫర్మ్ చేసుకుని పోలీస్, టాస్క్‌ఫోర్స్, ఫుడ్ సేఫ్టీ అధికారులకు వరుసగా సమాచారం ఇచ్చినా ఫలితం శూన్యం.. ఫిర్యాదు చేసిన జర్నలిస్టులపైనే కేసు పెట్టారంటూ ఆవేదన"**


జర్నలిస్టుపై దాడి చేస్తున్న దృశ్యం



పోలీసుల ముందే జర్నలిస్టులను దూషిస్తున్న దృశ్యం

**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** కల్తీ ఆహార పదార్థాల తయారీ, సరఫరా, విక్రయాలపై హైదరాబాద్ సిపి సజ్జనార్, డీజీపీ సీవీ ఆనంద్, పోలీసు ఉన్నతాధికారులు కఠినంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే పోరాటంలో తాము సైతం భాగస్వాములమవుతామని భావించిన జర్నలిస్టులకు ఎదురైన పరిణామాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. కల్తీ ఆహార పదార్థాలపై వరుసగా ఇన్వెస్టిగేషన్ చేస్తూ, సమాచారం అందిన ప్రతిసారీ సంబంధిత పోలీసు, ఎస్‌ఓటి, ఫుడ్ సేఫ్టీ అధికారులకు సమాచారం అందిస్తున్న రిపోర్టర్లకే పోలీసుల నుంచి ప్రశ్నలు, కేసులు, గంటల తరబడి స్టేషన్‌లో కూర్చోబెట్టే పరిస్థితి ఎందుకొచ్చిందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇప్పటికే అల్వాల్, సికింద్రాబాద్ పికెట్ ప్రాంతాల్లో కల్తీ ఆహార పదార్థాలకు సంబంధించి సమాచారం అందించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని సీజ్ చేయించిన జర్నలిస్టులు. తాజాగా హబ్సిగూడ స్ట్రీట్ నంబర్ 8లో కల్తీ పన్నీర్ సరఫరా అవుతున్నట్లు సమాచారం అందడంతో అక్కడికి వెళ్లారు. అక్కడ ఓ మిల్క్ షాప్ ముందు ఆటోలో పన్నీర్ ప్యాకింగ్ చేస్తున్న దృశ్యాలు కనిపించడంతో ఫోటోలు, వీడియోలు చిత్రీకరించినట్లు జర్నలిస్టులు చెబుతున్నారు. వెంటనే మేడ్చల్ జిల్లా ఎస్‌ఓటి అధికారులకు సమాచారం అందించగా, అది హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోకి వస్తుందని చెప్పడంతో హైదరాబాద్ పోలీసు అధికారులను సంప్రదించినట్లు వారు తెలిపారు. ఏసీపీ జగన్, సెక్టర్ ఇంచార్జ్ కరుణాకర్‌తో పాటు టాస్క్‌ఫోర్స్ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చామని, ఫుడ్ సేఫ్టీ అధికారులకు, సంబంధిత హెల్ప్‌లైన్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు లొకేషన్ పంపాలని కోరడంతో లొకేషన్‌ను సైతం షేర్ చేసినట్లు జర్నలిస్టులు చెబుతున్నారు. అధికారులు సంఘటనా స్థలానికి చేరుకునేలోపు రోడ్డుకు అవతలి వైపు వేచి ఉన్నారు. అయితే అప్పటికే అక్కడికి వచ్చిన పోలీసులు వాటిని పరిశీలించి అధికారులకు ఫోన్ ద్వారా తెలిపారు. టాస్క్ ఫోర్స్ పోలీసులకు సమాచారం ఇచ్చినప్పుడు అక్కడికి వచ్చిన పోలీసులు సైతం పూర్తి వివరాలు సేకరించి తరువాత అధికారులతో మాట్లాడారు. షాపులో పని చేసి వ్యక్తి, ఆటో డ్రైవర్ ఇచ్చిన సమాచారంతో బంధువు ను అని ఒక వ్యక్తి దాదాపు 20 మంది వరకు వెంట తీసుకొచ్చి జర్నలిస్టుల పైనే చేయి చేసుకోవడం వారిని అసభ్య పదజాలాలతో దూషించడం తోపాటు వాళ్ళ ఆగడాలను చిత్రీకరిస్తున్న మహిళా జర్నలిస్టుపై దాడి చేసి ఫోన్ లాక్కున్నారు. "మీరు వెళ్లిపోండి.. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి.. పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయండి" అంటూ బెదిరించినట్లు జర్నలిస్టులు పేర్కొన్నారు.

## ఫిర్యాదు చేసిన వారిపైనే కేసా.?

దాడి, దురుసు ప్రవర్తనపై ఫిర్యాదు చేసేందుకు ఓయూ పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన జర్నలిస్టుల వాదన ప్రకారం.. దాదాపు సాయంత్రం 6 గంటల వరకు ఫిర్యాదు చేశామని అయితే తమ ఫిర్యాదుపై తక్షణ ప్రాథమిక విచారణ చేయకుండా, తమ తర్వాత దాదాపు రాత్రి 9 గంటలకు వచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారని ఆరోపించారు. అనంతరం తమను పోలీస్ స్టేషన్ లోనే గంటల తరబడి విచారణ పేరుతో కూర్చోబెట్టారని వారు పేర్కొన్నారు. విచారణలో మీకు ఏ అధికారం ఉంది అక్కడికి వెళ్లడానికి.? అంటూ ప్రశ్నించారని జర్నలిస్టులు పేర్కొంటున్నారు. విధి నిర్వహణలో భాగంగానే అక్కడికి వెళ్లి ఫోటోలు, వీడియోలు తీసి, సంబంధిత అధికారులకు సమాచారం అందించామని చెప్పినా తమను నిందితుల మాదిరిగా చూశారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆకలిగా ఉందని, భోజనం తెప్పించాలని కోరినా స్పందించలేదని టిఫిన్ చేసి వస్తామని చెప్పినా బయటకు పంపలేదని, రాత్రి ఒంటి గంట వరకు పోలీస్ స్టేషన్‌లోనే కూర్చోబెట్టారని జర్నలిస్టులు ఆరోపిస్తున్నారు. సంతకాలు తీసుకొని నోటీసులు ఇస్తామని చెప్పినా నోటీసులు ఇవ్వలేదన్నారు. తర్వాత రోజు ఆగస్టు 5న సాయంత్రం 5 గంటలకు రావాలని ఎస్సై కరుణాకర్ చెప్పడంతో స్టేషన్‌కు వెళ్లగా, రాత్రి 9 గంటల వరకు కూర్చోబెట్టి తమపై ఉన్న కేసులను పరిశీలించి నిర్ణయం తీసుకున్న తర్వాత నోటీసులు ఇస్తామని చెప్పారని జర్నలిస్టులు తెలిపారు.

## కల్తీని కట్టడి చేయాలా.? ప్రశ్నించే గొంతును కట్టడి చేయాలా.?

ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కల్తీ ఆహార మాఫియాను అడ్డుకునేందుకు సాక్షాత్ హైదరాబాద్ సీపీ సజ్జనార్, డీజీపీ సీవీ ఆనంద్, ఉన్నత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేస్తున్న సమయంలో స్థానిక పోలీస్ స్టేషన్లో ఉన్న అధికారులకు సమాచారం అందించిన జర్నలిస్టులే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తే ఇక అక్రమాలను వెలుగులోకి తెచ్చే ధైర్యం ఎవరికుంటుందనే ప్రశ్న తలెత్తుతోంది.

## కల్తీ పన్నీర్ తయారి, సరఫరా చేసేవారిపై చర్యలా.? లేక కల్తీని బయటపెట్టే రిపోర్టర్లపై చర్యలా.?

ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే ప్రయత్నం చేసిన జర్నలిస్టులను నిందితులుగా చూడటం సమంజసమేనా.? అధికారుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తే ప్రతి రిపోర్టర్‌పై కేసులేనా.? ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు తక్షణమే శాఖాపరమైన విచారణ చేపట్టి, సంఘటనకు సంబంధించిన సీసీ కెమెరా దృశ్యాలు, ఫోన్ కాల్ వివరాలు, ఫిర్యాదుల తేదీలు, పోలీస్ స్టేషన్‌లోని సీసీ కెమెరాలను పరిశీలించాలని జర్నలిస్టులు కోరుతున్నారు. నిజానిజాలు నిగ్గుతేల్చి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని


మహిళ జర్నలిస్టు నుండి దౌర్జన్యంగా ఫోన్ లాక్కున్న దృశ్యం

కోరుతున్నారు.

**అక్రమాలను ప్రశ్నించే కలం బలహీనపడితే.. ప్రజల తరఫున నిలబడే గొంతు మూగబోతుంది. కల్తీ మాఫియాను కట్టడి చేయాల్సిన వ్యవస్థలే, ప్రశ్నించే జర్నలిస్టులనే కట్టడి చేస్తే ప్రజాస్వామ్యంలో మిగిలేది ఏమిటో ఉన్నతాధికారులే సమాధానం చెప్పాలి.**

# సాగర్ తీరంలో వరుణ యాగం

- ఈ నెల 10న వరుణయాగం నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం
- ముహూర్తం ఖరారు చేసిన యాదగిరిగుట్ట ఆలయ అర్చకులు
- దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో యాగ క్రతువులు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని, నదులు, డ్యామ్‌లు జలకళతో నిండాలని ఆకాంక్షిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు. నాగార్జునసాగర్ వేదికగా 'మహా వరుణ యాగం' నిర్వహించాలని ఆయన సంకల్పించారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో.. ప్రకృతి కరుణించి ప్రజలకు సాగు, తాగునీటి ఎద్దడి లేకుండా ఉండాలనే బృహత్తర ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆధ్యాత్మిక మార్గాన్ని ఎంచుకుంది. ఈ మహా యాగ నిర్వహణకు యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన అర్చకులు, సిద్ధాంతులు, వేదపండితులు ఆగస్ట్ 10వ తేదీని శుభ ముహూర్తంగా ఖరారు చేశారు. నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ డ్యామ్ తీరంలోని విజయవిహార్ ప్రాంగణంలో ఈ యాగ క్రతువులను నిర్వహించేందుకు ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో ఈ మహా వరుణ యాగం వైభవంగా జరగనుంది. ఈ యాగం కోసం విజయవిహార్ ప్రాంగణంలో ప్రత్యేకంగా 11 హోమగుండాలను నిర్మిస్తున్నారు. యాదగిరిగుట్ట దేవస్థానానికి చెందిన సుమారు 108 మంది వేద పండితులు, ఋత్వికులు శాస్త్రోక్తంగా ఈ పవిత్ర యాగ క్రతువులను

2లో..



# ఆందోళన వద్దు.. మీకు నేను ఉన్నాను

- టీఎంసీ, ఉద్ధవ్ సేన రెబల్ ఎంపీలకు ప్రధాని భరోసా



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా కొనసాగుతున్న నిరసనలు, గందరగోళం నడుమ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కొత్తగా ఎన్నికైన ఎన్డీఏ లోక్‌సభ ఎంపీలతో శుక్రవారం బ్రేక్‌ఫాస్ట్ భేటీ నిర్వహించారు. పార్లమెంటరీ చర్చలలో చురుకుగా పాల్గొనాలని ఈ సందర్భంగా ఆయన వారిని కోరారు.

2లో..

## జీఐ ట్యాగ్‌తో కుప్పడం పట్టుకు

# కొత్త కళ

## - సీఎం చంద్రబాబు వద్ద నేతన్నల హర్షం

- చీరాల నియోజకవర్గంలో 'నేతన్న సేవలో' ప్రారంభం
- ఉచిత విద్యుత్, రూ.25 వేల ఆర్థిక సాయంపై చేనేతల హర్షం
- ప్రభుత్వసాయం బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు చూపిన సీఎం



అమరావతి (ప్రశ్న న్యూస్) భౌగోళిక గుర్తింపు (జీఐ ట్యాగ్) లభించడంతో చీరాల కుప్పడం పట్టు చీరలకు విశిష్టమైన గుర్తింపు వచ్చిందని, దీనివల్ల అమ్మకాలు ఏకంగా 30 శాతం పెరిగాయని చేనేత కుటుంబాలు ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద హర్షం వ్యక్తం చేశాయి. ప్రభుత్వం అందిస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, రూ.25 వేల ఆర్థిక సాయం తమకు

2లో..

ప్రజాప్రశ్న

హైదరాబాద్ శనివారం 8, ఆగష్టు 2026

# సాగర్ తీరంలో వరుణ యాగం

జరపనున్నారు.నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలోని 22 లక్షల ఎకరాలకు సాగునీరు అందాలని పాడిపంటలు సమృద్ధిగా పండాలనే సంకల్పంతో రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక పూజలు చేపడుతున్నారు. యాగంలో అత్యంత కీలకమైన మహత్తర 'సకల పూర్ణాహుతి' కార్యక్రమాన్ని ఆగస్ట్ 10వ తేదీ మధ్యాహ్నం 3:20 నుంచి 3:24 గంటల మధ్య నిర్వహించనుండగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు ఇందులో పాల్గొని స్వామివారిని దర్శించుకోనున్నారు. యాగం ఏర్పాట్లను నల్గొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవార్, దేవాదాయ శాఖ అధికారులు, యాదగిరిగుట్ట ఆలయ అర్చకులు స్థల పరిశీలన చేసి పర్యవేక్షిస్తున్నారు. ఆధ్యాత్మిక సంప్రదాయాలు, రాష్ట్ర సంక్షేమ లక్ష్యాల సమ్మేళనంగా నిర్వహిస్తున్న ఈ వరుణ యాగంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# ఆందోళన వద్దు..మీకు నేను ఉన్నాను

పార్లమెంట్ అనేది 'ప్రజాస్వామ్యానికి అత్యున్నత దేవాలయం' అని మోదీ స్పష్టం చేశారు. అయితే, ఇటీవలి జరుగుతోన్న ఆటంకాల పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ గందరగోళం కారణంగా కొత్త ఎంపీలకు సభలో మాట్లాడే అవకాశం లభించడం లేదని ఆయన అన్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

### మోదీ బ్రేక్‌ఫాస్ట్ భేటీ

'ఇది కొత్తవారికి అన్యాయం చేయడం లాంటిదే' అని వ్యాఖ్యానించి మోదీ.. సభా కార్యకలాపాలు సజావుగా, సాఫీగా సాగాలని ఉద్ఘాటించారు. అలాగే, పార్లమెంట్ చరిత్రను చదవాలని, అధ్యయనం చేసిన అర్థం చేసుకోవాలని కొత్త ఎంపీలకు ప్రధాని సూచించారు. "పార్లమెంట్‌లో ఎంతో చారిత్రక సమాచారం అందుబాటులో ఉంది.. చర్చలకు సిద్ధమయ్యేందుకు దాన్ని ఉపయోగించుకోండి. మీ మీ రాష్ట్రాల అభివృద్ధికి కృషి చేయండి, రాష్ట్రాలు పురోగమించినప్పుడే దేశం పురోగమిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు.మోదీతో బ్రేక్‌ఫాస్ట్ భేటీలో షిండే వర్గంలో చేరి శివసేన (యూబీటీ)కి చెందిన ఆరుగురు, నేషనల్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియాలో చేరిన తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 20 మంది రెబల్స్, ఎన్సీపీ (అజిత్ పవార్)కి చెందిన ఇద్దరు సహా 45 మంది లోక్‌సభ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా టీఎంసీ, శివసేన రెబల్ ఎంపీలకు ఎలాంటి ఆందోళన చెందవద్దని, మీకు తాను ఉన్నానంటూ ప్రధాని మోదీ భరోసా ఇచ్చారు.

### నేను మీకున్నా.. మోదీ

"ఎన్డీఏ ఒక కుటుంబం. మేము భాగస్వామ్య పార్టీలతో ఉన్నాం ప్రతి వ్యక్తికి గౌరవం దక్కుతుంది ప్రతి ఒక్కరికీ అవకాశం వస్తుంది. నేను కేవలం ఎన్డీఏలోని ఒక భాగస్వామ్య పార్టీతోనే కాదు, ప్రతి ఎంపీతోనూ ఉన్నాను. నేను ఎన్డీఏలోని ప్రతి ఎంపీకి అండగా నిలుస్తాను. మీరు ఎవరి గురించీ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు" అని ఆయన అన్నారు. తమ నియోజకవర్గాల్లో అభివృద్ధి ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లేందుకు తమ అధికారాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని ప్రధాని వారిని కోరారు. "మీ ప్రాంతంలో ఏ అభివృద్ధి పని కోసమైనా నేరుగా ప్రధానమంత్రి కార్యాలయాన్ని సంప్రదించండి. పేదలు, కార్మికులు, రైతులతో సహా అందరినీ కలవండి, ప్రతి ఒక్కరి సమస్యలను అర్థం చేసుకోండి" అని ఆయన పేర్కొన్నారు. అనంతరం ప్రతి ఎంపీతో వ్యక్తిగతంగా మాట్లాడిన మోదీ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

### బీజేపీ ఎంపీలతో భేటీ

వర్షాకాల సమావేశాల సందర్భంగా పార్లమెంట్ సభ్యులతో సంప్రదింపులలో భాగంగా ప్రధాని మోదీ తన అధికారిక నివాసంలో 37 మంది బీజేపీ ఎంపీలతో విందు సమావేశం నిర్వహించిన మర్నాడే బ్రేక్‌ఫాస్ట్ భేటీ జరిగింది. పాలన, పార్లమెంటరీ వ్యవహారాలపై అభిప్రాయాలను పంచుకోవడంతో పాటు అలాగే పార్టీలో సమన్వయాన్ని బలోపేతం చేసేందుకు ఈ అనధికారిక భేటీ జరిగింది.ఎంపీలతో తన వ్యక్తిగత అనుభవాలను పంచుకోవడంతో పాటు పలు అంశాలపై ప్రధాని చర్చలు జరిపినట్లు సమాచారం. ఈ సందర్భంగా ఎంపీలు 'ఢిల్లీ రాజకీయ కథనాల వలలో' చిక్కుకోవద్దని, అలాగే ప్రతిపక్ష సభ్యులతో స్నేహపూర్వక సంబంధాలను కొనసాగించాలని వారికి ప్రధాని మోదీ సూచించారు.

# జీఐ ట్యాగ్‌తో కుప్పడం పట్టుకు కొత్త కళ

కొండంత అండగా నిలుస్తోందని వారు తెలిపారు. 12వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం చీరాల నియోజకవర్గం కొత్తపేటలో ముఖ్యమంత్రి చంద్రబాబు 'నేతన్న సేవలో' పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్తపేట గ్రామంలోని ఓ చేనేత మగ్గం యూనిట్‌ను సీఎం సందర్శించారు. యూనిట్ యజమాని బండారు బాలసుబ్రహ్మణ్యం ఆయనకు సాదర స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి అక్కడి చేనేత కార్మికులతో నేరుగా మాట్లాడారు. కుప్పడం పట్టు చీరల తయారీలో ప్రత్యేకతలు, సంప్రదాయ నైపుణ్యం, ఉత్పత్తి వ్యయం, మార్కెట్ పరిస్థితులు, ఆదాయం వంటి అంశాలపై వారితో వివరంగా చర్చించారు. 'వన్ డిస్ట్రిక్ట్--వన్ ప్రొడక్ట్' పథకం ద్వారా తమ ఉత్పత్తులకు మంచి ప్రచారం లభిస్తోందని, గత ఏడాది కుప్పడం పట్టుకు కేంద్ర ప్రభుత్వ అవార్డు రావడం గర్వకారణమని చేనేతలు ముఖ్యమంత్రికి వివరించారు.

### ప్రభుత్వ సహకారంతో జీవనోపాధికి భరోసా

యూనిట్‌లోని చేనేత కార్మికులతో సీఎం ముఖాముఖిగా మాట్లాడారు. తొలుత కంచి బోర్డర్ చీరల తయారీదారు బత్తా ధనుంజయరావుతో సంభాషించారు. ఆయన కుటుంబ పరిస్థితులు, వృత్తిలో ఎదురవుతున్న సవాళ్ల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సాయం తమకు ఎంతో ఊరటనిస్తోందని, ముఖ్యంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వల్ల ఉత్పత్తి ఖర్చు తగ్గిందని కార్మికులు వివరించారు. రూ.25 వేల ఆర్థిక సాయం తమకు ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తోందని తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి, యూనిట్ యజమాని బండారు బాలసుబ్రహ్మణ్యంతో కలిసి వర్క్‌షాప్‌లోని మొదటి అంతస్తును పరిశీలించారు. భవనాన్ని మరింత విస్తరించి, మరిన్ని మగ్గాలు ఏర్పాటు చేసి ఎక్కువ మందికి ఉపాధి కల్పించాలన్న తన ప్రణాళికను బాలసుబ్రహ్మణ్యం సీఎంకు వివరించారు. కోవిడ్ కారణంగా నిలిచిపోయిన విస్తరణ పనులను త్వరలోనే తిరిగి ప్రారంభిస్తానని తెలిపారు. ఈ క్రమంలో, మగ్గంపై చీర నేస్తున్న బొడ్డు అరుణ అనే మహిళా కార్మికురాలి పనితీరును సీఎం ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా పలువురు చేనేత కార్మికులు తమ మొబైల్ ఫోన్లను ముఖ్యమంత్రికి చూపిస్తూ ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అందించిన రూ.25 వేల ఆర్థిక సాయం తమ బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్లు ఫోన్ కు వచ్చిన ఎస్సెమ్మెస్ లను వారు సీఎంకు చూపించారు. ప్రభుత్వ సహకారంతో తమ జీవనోపాధికి పూర్తి భరోసా లభించిందని, భవిష్యత్తుపై నమ్మకం కలిగిందని చేనేత కుటుంబాలు సంతోషం వ్యక్తం చేశాయి.

# ఢిల్లీలో వర్ష బీభత్సం

## - స్తంభించిన జనజీవనం



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** దేశ రాజధాని ఢిల్లీతో పాటు దాని పరిసర ప్రాంతాలను (ఎన్‌సీఆర్) శుక్రవారం కుండపోత వర్షం ముంచెత్తింది. ఈ భారీ వర్షాల కారణంగా పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారులపై ట్రాఫిక్ భారీగా స్తంభించడంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. దక్షిణ ఢిల్లీలోని మెహ్రౌలీ-బదర్‌పూర్ రోడ్డులో పరిస్థితి పూర్తి జలమయంగా మారింది. ఇక్కడి ఎయిర్ ఫోర్స్ స్టేషన్ సమీపంలో సుమారు నాలుగు అడుగుల మేర నీరు నిలిచిపోవడంతో వాహనాలు నీటిలో చిక్కుకుపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ఓఖ్లా మోర్, ఖాన్‌పూర్, సంగమ్ విహార్ వంటి ప్రాంతాలు కూడా నీట మునిగాయి. నీటిలో చిక్కుకున్న వాహనాలను బయటకు తీసేందుకు ఎయిర్ ఫోర్స్ ట్రక్కులు సహాయక చర్యలు చేపట్టాయి. ఐటీఓ, పటేల్ రోడ్, రోహతక్ రోడ్, ఢిల్లీ-జైపూర్ హైవే వంటి మార్గాల్లో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.ఈ వర్షాల ధాటికి తొమ్మిది ఇళ్లు కూలిపోయాయని, 16 ప్రాంతాల్లో చెట్లు విరిగిపడ్డాయని ఢిల్లీ ఫైర్ సర్వీస్ విభాగం వెల్లడించింది. ఒక ఇంటిపై చెట్టు కూలడంతో లోపల చిక్కుకున్న ముగ్గురు మహిళలను అగ్నిమాపక సిబ్బంది రక్షించారు. శుక్రవారం ఉదయం నాటికి సఫ్దర్‌జంగ్‌లో 59.2 మి.మీ, లోధి రోడ్డులో 60.4 మి.మీ వర్షపాతం నమోదైంది. ఫరీదాబాద్‌లో రికార్డు స్థాయిలో 119.4 మి.మీ వర్షపాతం కురిసింది. ఎన్‌సీఆర్ పరిధిలోని నోయిడాలో నీటితో నిండిన అండర్‌పాస్‌లో ఒక అంబులెన్స్ అరగంటకు పైగా చిక్కుకుపోయింది. గురుగ్రామ్‌లోని సివిల్ హాస్పిటల్ బేస్‌మెంట్‌లోకి వర్షపు నీరు చేరడంతో వైద్య సేవలను తాత్కాలికంగా నిలిపివేశారు.మరోవైపు, భారత వాతావరణ శాఖ ఈ ప్రాంతానికి రెడ్ అలర్ట్ జారీ చేసింది. శుక్రవారం రోజంతా భారీ వర్షాలు కొనసాగుతాయని, శనివారం నుంచి వర్ష తీవ్రత తగ్గుముఖం పట్టవచ్చని వాతావరణ శాఖ తెలిపింది. అత్యవసరమైతే తప్ప ప్రజలు ప్రయాణాలు చేయవద్దని అధికారులు సూచించారు.

# చేనేతలకు అండగా ఉండండి

## - కేసీఆర్ పథకాలను అమలు చేయాలని సీఎం రేవంత్ కు లేఖ




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ బోర్డు, హ్యాండీక్రాఫ్ట్ బోర్డు, పవర్‌లూమ్ బోర్డులను రద్దు చేయడం, హౌస్ కమ్ వర్క్‌షెడ్ వంటి పథకాలను ఎత్తివేయడం, చేనేత ఉత్పత్తులపై 5 శాతం జీఎస్టీ విధించడం వంటి నిర్ణయాలు చేనేత రంగాన్ని తీవ్రంగా దెబ్బతీశాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ సంస్కృతి, అస్తిత్వానికి వెన్నెముకగా నిలిచిన చేనేత కార్మికుల పరిస్థితి కాంగ్రెస్ పాలనలో తీవ్రంగా దిగజారిందని ఆందోళన వ్యక్తం చేశారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ నాయకత్వంలో అమలైన 'నేతన్న బీమా', 'నేతన్నకు చేయూత' వంటి నేతన్నల కోసం ప్రత్యేకంగా అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలను నిలిపివేసి నేతన్నలను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు.

### చేనేత రంగాన్ని సంక్షోభం వైపు నెడుతున్న కాంగ్రెస్,బీజేపీ

ఎన్నికల ముందు కాంగ్రెస్ చేనేత కార్మికులకు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు కాలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. వెంటనే అన్ని పథకాలను పునరుద్ధరించి నేతన్నలకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. జాతీయ చేనేత దినోత్సవం కేవలం ఉత్సవాలు నిర్వహించుకునే రోజు కాదని, చేనేత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే విధానాలు అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. కానీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రెండూ కలిసి చేనేత రంగాన్ని సంక్షోభం వైపు నెడుతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు.

### చేనేత కార్మికులకు రూ.5లక్షలు బీమా

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దేశంలో ఎక్కడా లేనివిధంగా చేనేత రంగానికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 55,072 మంది చేనేత కార్మికులకు రూ.5 లక్షల జీవిత బీమా కల్పిస్తూ 'నేతన్న బీమా' అమలు చేశామని తెలిపారు. ఒక్కో కార్మికుడికి ప్రీమియం ప్రభుత్వమే భరించిందని వివరించారు. 'నేతన్నకు చేయూత' పథకం ద్వారా కార్మికుల పొదుపును ప్రోత్సహిస్తూ, కార్మికుడు ప్రతి నెలా రూ.1,200, అనుబంధ కార్మికుడు రూ.800 చెల్లిస్తే ప్రభుత్వం రూ.4,000 వరకు వాటా జమ చేసే వినూత్న విధానాన్ని అమలు చేశామని కేటీఆర్ గుర్తు చేశారు. అదేవిధంగా చేనేత సహకార సంఘాలకు పావలా వడ్డీ రుణాలు, 20 శాతం మార్కెటింగ్ రిబేట్ అందించడంతో పాటు బతుకమ్మ చీరలు, ప్రభుత్వ పాఠశాల యూనిఫారాల తయారీ వంటి భారీ ప్రభుత్వ ఆర్డర్లను చేనేత రంగానికే అప్పగించి వేలాది కుటుంబాలకు నిరంతర ఉపాధి కల్పించామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు.

### అడ్డగోలుగా హామీలిచ్చి మోసంచేస్తోన్న కాంగ్రెస్

'కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన చేనేత సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా నిలిపివేసిందని కేటీఆర్ ఆరోపించారు. ప్రస్తుతం 'నేతన్న బీమా' అమలు కావడం లేదని, 'నేతన్నకు చేయూత' పథకం చెల్లింపులు పూర్తిగా ఆగిపోయాయని పేర్కొన్నారు. చేనేత సహకార సంఘాలకు ఇవ్వాల్సిన పావలా వడ్డీ రుణాలు, మార్కెటింగ్ రిబేట్లు నిలిచిపోయాయని, బతుకమ్మ చీరలు, ప్రభుత్వ యూనిఫారాల వంటి ప్రభుత్వ ఆర్డర్లలో నేతన్నలకు గతంలో ఇచ్చిన ప్రాధాన్యతను తగ్గించారని విమర్శించారు. ప్రభుత్వ ఆర్డర్లు అన్ని కమీషన్ల కోసం ప్రైవేట్ సంస్థలకు వ్యక్తులకు అప్పజెప్తున్నారని విమర్శించారు. నేతన్నల కోసం గత ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ ఏమయ్యాయని కేటీఆర్ ప్రశ్నించారు. అడ్డగోలుగా హామీలు ఇచ్చి అందరిని మోసం చేసినట్లుగానే నేతన్నలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నది అని కేటీఆర్ విమర్శించారు.

### చేనేతలకు ప్రతీ ఏడాది రూ.18వేలు ఆర్థిక సాయం

'ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని కేటీఆర్ అన్నారు. చేనేత భరోసా కింద ప్రతి ఏడాది రూ.18 వేల ఆర్థిక సాయం, అనుబంధ కార్మికులకు రూ.6 వేల సహాయం, లక్ష రూపాయల వరకు వ్యక్తిగత రుణమాఫీ, చేనేత సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ రుణాల మాఫీ, కేంద్రం విధిస్తున్న 5 శాతం జీఎస్టీ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందన్న హామీల్లో ఒక్కటీ అమలు కాలేదని విమర్శించారు. రెండున్నరేళ్లు గడిచినా నేతన్నలకు ఇచ్చిన హామీలు కాగితాలకే పరిమితమయ్యాయని కేటీఆర్ మండిపడ్డారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా చేనేత రంగానికి తీవ్ర అన్యాయం చేసిందని కేటీఆర్ విమర్శించారు. ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ బోర్డు, హ్యాండీక్రాఫ్ట్ బోర్డు, పవర్‌లూమ్ బోర్డులను రద్దు చేయడం, హౌస్ కమ్ వర్క్‌షెడ్ వంటి పథకాలను ఎత్తివేయడం, చేనేత ఉత్పత్తులపై 5 శాతం జీఎస్టీ విధించడం వంటి నిర్ణయాలు చేనేత రంగాన్ని తీవ్రంగా దెబ్బతీశాయని పేర్కొన్నారు. పార్టీలు వేరైనా చేనేత విషయంలో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాల వైఖరిలో ఎలాంటి తేడా లేదని కేటీఆర్ ఆరోపించారు.

### నేతన్నల కుటుంబాలకు అండగా నిలవాలి

'జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన బహిరంగ లేఖలో రాష్ట్రంలోని నేతన్నల తరపున ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. చేనేత కళాకారుల కోసం ప్రత్యేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను యుద్ధప్రాతిపదికన అమలు చేయాలని, గతంలో రద్దు చేసిన అన్ని పథకాలను పునరుద్ధరించాలని కోరారు. ముఖ్యంగా కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'నేతన్న బీమా', 'నేతన్నకు చేయూత' పథకాలను వెంటనే తిరిగి ప్రారంభించి బకాయిలు విడుదల చేయాలని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన చేనేత భరోసా, రుణమాఫీ, జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ హామీలను తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.'మన చేనేత.. మన గౌరవం. నేతన్న బతికితేనే చేనేత బతుకుతుంది. చేనేత బతికితేనే మన సంస్కృతి, మన స్వాభిమానం సజీవంగా ఉంటాయి. ఇప్పటికైనా మోసపూరిత వైఖరిని వీడి నేతన్నల కుటుంబాలకు అండగా నిలవాలి'అని కేటీఆర్ తన లేఖలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

# జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ

## - రామచందర్‌రావు క్లారిటీ




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రానున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికల్లో ఏ పార్టీతోనూ పొత్తులు పెట్టుకునేది లేదని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు స్పష్టం చేశారు. తమ పార్టీ ఒంటరిగానే బరిలోకి దిగుతుందని తేల్చి చెప్పారు. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే తమ ఏకైక లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. దేశ రాజధాని ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌తో తెలంగాణ రాష్ట్ర బీజేపీ కీలక నేతల సమావేశం జరిగింది. ఈ కీలక భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన రామచందర్‌రావు పార్టీ భవిష్యత్తు కార్యాచరణ, వ్యూహాలను వెల్లడించారు. తెలంగాణలో బీజేపీ ఒంటరి పోరుపై స్పందిస్తూ జాతీయ స్థాయిలో ఎన్డీఏ కూటమిలో జనసేన పార్టీ భాగస్వామిగా ఉన్నప్పటికీ రాష్ట్రంలో ఎన్నికల పొత్తుల అంశంపై తుది నిర్ణయాన్ని అధిష్టానమే చూసుకుంటుందని రామచందర్‌రావు పేర్కొన్నారు. ప్రస్తుతం తెలంగాణలోని 937 మండలాల్లో బీజేపీ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. వచ్చే శాసనసభ సమావేశాలు పూర్తి అయిన వెంటనే రాష్ట్రంలోని ఎంపీలు, ఎమ్మెల్యేలతో మరొకసారి ప్రత్యేకంగా సమావేశమై భవిష్యత్తు ప్రణాళికను రూపొందిస్తామన్నారు.ఒడిశా, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల కంటే తెలంగాణలోనే సంస్థాగతంగా బీజేపీ మరింత బలంగా ఉందన్న రామచందర్‌రావు వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ఎండగట్టడమే ప్రధాన అజెండాగా పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో అవినీతి పెరిగిపోయిందని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో విఫలమైంది. తెలంగాణలో ప్రజా సమస్యలపై అందరూ కలిసికట్టుగా రోడ్లపైకి వచ్చి పోరాటం చేయాలని జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తమకు దిశానిర్దేశం చేశారని రామచందర్‌రావు వెల్లడించారు. బీజేపీని అధికారంలోకి తీసుకురావడం కోసం స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను తయారు చేయాలని పార్టీ హైకమాండ్ ఆదేశించిందని.. ప్రతి 3 నెలలకొకసారి జాతీయ అధ్యక్షుడు తెలంగాణను సందర్శించి పార్టీ పరిస్థితులను సమీక్షిస్తారని పేర్కొన్నారు.ఇదే సమయంలో బీజేపీలో అంతర్గత విషయాలపై వస్తున్న ప్రచారాలను రామచందర్‌రావు ఖండించారు. బీజేపీలో కొత్త, పాత నేతల మధ్య ఎలాంటి వ్యత్యాసాలు లేవని తేల్చిచెప్పారు. నాయకుల మధ్య అభిప్రాయ భేదాలు ఉండవచ్చని కానీ విభేదాలు మాత్రం లేవని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ సహా ఇతర పార్టీల నుంచి పలువురు కీలక నేతలు బీజేపీలో చేరేందుకు రెడీగా ఉన్నారని సరైన సమయం కోసం వారు వేచి చూస్తున్నారని చెప్పారు. డీలిమిటేషన్ బిల్లుకు పార్లమెంట్‌లో ఆమోదం లభిస్తుందని వ్యాఖ్యానించిన రామచందర్‌రావు.. ప్రతిపక్షాలకు చెందిన పలువురు నేతలు కూడా దీనికి మద్దతు తెలిపే అవకాశం ఉందని పేర్కొన్నారు.

# ఇచ్చిన హామీలు అమలు చేయని కాంగ్రెస్

## గంగాధర మండల బీఆర్ఎస్ అధ్యక్షులు మెచినేని నవీన్‌రావు



**చొప్పదండి** కరీంగర్ జిల్లా గంగాధర మండలంలోని నారాయణపూర్ ముంపు గ్రామ సమస్యను కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటోందని గంగాధర మండల బీఆర్ఎస్ అధ్యక్షులు మెచినేని నవీన్‌రావు విమర్శించారు. ఎన్నికల సమయంలో నారాయణపూర్‌ను ముంపు గ్రామంగా ప్రకటిస్తామని ఎమ్మెల్యే, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజలకు బహిరంగంగా హామీ ఇచ్చారని, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా నెల రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని చెప్పి నేటికీ మాట నిలబెట్టుకోలేదని అన్నారు.ప్రజలు తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే, దానిని బీఆర్ఎస్ ప్రేరేపించిందంటూ తప్పుడు ప్రచారం చేయడం బాధ్యతారాహిత్యమని ఆయన పేర్కొన్నారు. ప్రజల ఆవేదనను అర్థం చేసుకుని సమస్యకు పరిష్కారం చూపాల్సిన ప్రభుత్వం, ప్రశ్నించిన వారిపై కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శించారు.మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రజలకు ఎప్పుడూ వాస్తవ పరిస్థితులను వివరించారని, సంబంధిత అధికారులతో సమీక్షలు నిర్వహించి సాధ్యాసాధ్యాలపై ప్రజలకు స్పష్టత ఇచ్చారని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ నాయకులు అసాధ్యమైన హామీలు ఇచ్చి ఇప్పుడు వాటిని అమలు చేయకుండా బీఆర్ఎస్‌పై నిందలు వేయడం సరికాదన్నారు.నారాయణపూర్ మాత్రమే కాకుండా నియోజకవర్గంలోని 33 గ్రామాల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. దర్శకుర్తిని మండలంగా చేస్తామని, కుడికాలువ సమస్యను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలను కూడా ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోరారు. లేకపోతే ప్రజలే ప్రభుత్వాన్ని నిలదీస్తారని హెచ్చరించారు.గ్రామసభలో జరిగిన పరిణామాలకు బీఆర్ఎస్‌కు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసిన ఆయన, అది పూర్తిగా గ్రామానికి సంబంధించిన అంతర్గత అంశమని తెలిపారు. గ్రామ ప్రజలు, వార్డు సభ్యులు, ఉపసర్పంచ్‌లు తమ సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యేను ప్రశ్నించడం సహజమని అన్నారు.ప్రతిపక్షంగా ప్రజల తరఫున ప్రశ్నించడం బీఆర్ఎస్ బాధ్యతేనని, ప్రభుత్వం హామీలు అమలు చేసే వరకు ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తామని నవీన్‌రావు స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించకుండా ప్రతిపక్షాన్ని విమర్శించడం వల్ల ప్రభుత్వ వైఫల్యాలు దాచలేరని అన్నారు.బీఆర్ఎస్‌పై నిరాధార ఆరోపణలు, బురదజల్లే ప్రయత్నాలు మానుకోవాలని కాంగ్రెస్ నాయకులను హెచ్చరించిన ఆయన, గ్రామ సమస్యలను సున్నితంగా పరిష్కరించి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత అని, లేకపోతే ప్రజలే తగిన రాజకీయ తీర్పు ఇస్తారని పేర్కొన్నారు.చివరగా, నారాయణపూర్ ముంపు గ్రామ సమస్యను తక్షణమే పరిష్కరించాలని, ప్రజలపై కేసులు పెట్టడం కాకుండా వారితో చర్చించి న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

# చేనేత దినోత్సవం రోజు
# ఆసుపత్రిలో సేవా కార్యక్రమం

**- రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ**

**రక్తదానంతో జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకున్న పద్మశాలి సంఘం**

**మండల ఆసుపత్రిలో పద్మశాలి నేతల మానవతా కార్యక్రమం**



ఏటూరు నాగారం(ప్రశ్న న్యూస్)జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పద్మశాలి సంఘం నాయకులు శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేయడంతో పాటు సంఘ సభ్యులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సేవే మా ధర్మం అంటూ చేనేత దినోత్సవాన్ని అర్థవంతంగా జరుపుకున్నారు.

**జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు చిప్ప అశోక్ మాట్లాడుతూ** చేనేత వృత్తిని కాపాడుకోవడంతో పాటు సమాజానికి సేవ చేయడమే అసలైన దినోత్సవ స్ఫూర్తి అని తెలిపారు.

**నూతి ప్రణయ్ మాట్లాడుతూ** చేనేత దినోత్సవం అంటే కేవలం వేడుకలు కాదు. మన వృత్తిని గౌరవించుకుంటూ, సమాజానికి ఏదైనా మంచి చేయాలి. ఈరోజు ఆసుపత్రిలోని రోగులకు మేము అందించిన చిన్న సాయం వారికి కొంత ఊరటనిస్తుందని ఆశిస్తున్నాం.

**అలువాల శ్రీనివాస్ మాట్లాడుతూ** పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏటా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేస్తున్నాం. రక్తదానం చేయడం ద్వారా మరో జీవితాన్ని కాపాడిన తృప్తి ఉంది. యువత అందరూ ఇందులో భాగం కావాలి.

**కందగట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ** ప్రభుత్వం చేనేతలకు ఇస్తున్న చేయూతను మేము స్వాగతిస్తున్నాం. కానీ మార్కెటింగ్, ఆర్థిక సహాయం ఇంకా పెరగాలి. ఈ దినోత్సవం సందర్భంగా అధికారులు మా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరుతున్నాం.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చిప్ప అశోక్, పోగుల లక్ష్మి నారాయణ, అలువాల శ్రీనివాస్, కందగట్ల వేణు, కందగట్ల శ్రీనివాస్, లోటాపెట్ల రాజేష్, నూతి ప్రణయ్, చెన్న రాంబాబు, శ్రీరామ్ సురేష్, ఇరుశావడ్ల నాగరాజు, కూరపాటి వేణుగోపాల్, చిరురాల గంగాధర్, కోడం కిరణ్, కోడం మురళి, గుండ్లపల్లి నాగరాజు, గుండ్లపల్లి సత్యం, చామర్తి కిషోర్, వావిలాల లక్ష్మణ్. పాల్గొన్నారు.

# ములుగు జిల్లా కలెక్టరేట్ కు
# భారతీయ జనతా పార్టీ రైతు మోర్చా వినతి

**- పిండి చేసిన బియ్యం, భారత ఆహార సంస్థ పెండింగ్ వివరాలు వెల్లడించాలి- రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపణ**

ములుగు(ప్రశ్న న్యూస్) రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని పిండి చేసి భారత ఆహార సంస్థకు పంపిన వివరాలను వెంటనే బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ రైతు మోర్చా శుక్రవారం ములుగు జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపింది.శుక్రవారం రోజున ములుగు జిల్లా కేంద్రంలో భారతీయ జనతా పార్టీ రైతు మోర్చా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జాడి రామరాజు నేతృత్వంలో కార్యకర్తలు కలెక్టరేట్ కు చేరుకుని పరిపాలనాధికారి రాజు కుమార్ కు వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, జిల్లా మాజీ అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే రైతులు నష్టపోతున్నారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి, దాన్ని పిండి చేసి భారత ఆహార సంస్థకు పంపడంలో పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది. దీని వల్ల రైతులకు రావాల్సిన డబ్బులు నేటికీ అందలేదు. మిల్లుల వారు కూడా అప్పుల పాలవుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ లెక్కలను క్లియర్ చేయాలి"బి అని డిమాండ్ చేశారు.రైతుల కష్టాన్ని ప్రభుత్వం గుర్తించడం లేదని, కేవలం హామీలు ఇవ్వడానికే పరిమితమవుతోందని ఆయన ఆరోపించారు.




### పూర్తి లెక్కలు బయటపెట్టాలి

రైతు మోర్చా జిల్లా అధ్యక్షుడు జాడి రామరాజు మాట్లాడుతూ జిల్లాలో ఎంత ధాన్యం సేకరించారు, ఎంత పిండి చేశారు, భారత ఆహార సంస్థకు ఎంత పంపారు అనే పూర్తి వివరాలను ప్రభుత్వం బహిరంగంగా ప్రకటించాలి. ఇందులో ఎలాంటి పారదర్శకత లేదు. అధికారులు కూడా సరైన సమాచారం ఇవ్వడం లేదు అన్నారు. పెండింగ్ లో ఉన్న బియ్యం సరఫరాను వెంటనే పూర్తి చేయాలని, లేకుంటే మరింత ఉధృతంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర భారతీయ జనతా పార్టీ కార్యవర్గ సభ్యుడు భూక్యా జహర్ లాల్, జిల్లా ఉపాధ్యక్షుడు జినుకూల కృష్ణాకర్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్రీలమంతుల రవీంద్రాచారి, నగరపు రమేష్, గిరిజన మోర్చా అధ్యక్షుడు సిద్దబోయిన సురేందర్, రైతు మోర్చా ప్రధాన కార్యదర్శి గుగులోత్ స్వామి నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు రాయంచు నాగరాజు, పట్టణ అధ్యక్షుడు రాఖేష్ యాదవ్, తాళ్లపల్లి లక్ష్మణ్, జిల్లా కార్యదర్శి లింగంపల్లి శ్రీనివాస్, వెనుకబడిన తరగతుల ఉపాధ్యక్షుడు గడ్డం శ్రీధర్, జిల్లా మండలి సభ్యుడు గద్దల హరిబాబు, మండల ఉపాధ్యక్షుడు దుర్గం దుర్గారావు, రైతు మోర్చా మండల అధ్యక్షుడు ఇర్సవడ్ల జగన్, రైతు మోర్చా అధ్యక్షుడు వార్డెల్లి వెంకన్న, మండల యువ మోర్చా ప్రధాన కార్యదర్శి కొండగొర్ల రాంబాబు, సామాజిక మాధ్యమాల సమన్వయకర్త దుర్గం శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన
# అంగన్వాడీలో వారోత్సవాలు

**పుట్టిన గంటలోనే తల్లిపాలు తప్పనిసరి - పర్యవేక్షకురాలు రజిత సూచన**

**రెండేళ్ల వరకు తల్లిపాలు ఇవ్వాలి - తల్లులకు సూచనలు**

**తల్లి బిడ్డ ఆరోగ్యానికి తల్లిపాలే మేలు.**

**ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలే - వైద్యుల సలహా**



ఏటూరు నాగారం (ప్రశ్నన్యూస్) బిడ్డల ఆరోగ్యానికి తల్లిపాలే ప్రధాన ఆధారమని, ప్రతి తల్లి తప్పనిసరిగా బిడ్డ పుట్టిన గంటలోనే పాలు ఇవ్వాలని సమగ్ర శిశు అభివృద్ధి పథకం పర్యవేక్షకురాలు ఆర్. రజిత తెలిపారు.శంకరాజ్ పల్లి అంగన్వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సూపర్ వైజర్ రజిత మాట్లాడుతూ పుట్టిన వెంటనే ఇచ్చే పురిటి పాలలో రోగనిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని చెప్పారు. బిడ్డకు ఆరు నెలలు నిండే వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఆ తర్వాత తల్లిపాలతో పాటు ఇతర ఆహారం కూడా మొదలు పెట్టాలని సూచించారు.తల్లిపాలు బిడ్డకు మేధస్సును పెంచుతాయని, ఎదుగుదలకు తోడ్పడతాయని, విరేచనాలు, వాంతులు వంటి సమస్యలు త్వరగా తగ్గుతాయని వివరించారు. తల్లి బిడ్డకు పాలు ఇవ్వడం వల్ల తల్లికి రొమ్ము సంబంధిత, గర్భాశయ సంబంధిత వ్యాధులు రాకుండా ఉంటాయన్నారు. అందుకే కనీసం రెండు సంవత్సరాల వరకు తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకురాలు ఎ. పావని, ఆశా కార్యకర్త కె. రమాదేవి, అంగన్వాడీ ఉపాధ్యాయులు డి. లక్ష్మమ్మ, కె. సరస్వతి, ఎ. కుసుమ, ఎ. జ్యోతి తో పాటు పలువురు తల్లులు పాల్గొన్నారు.

# బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో
# 10 కోట్ల వ్యసన విముక్తి ప్రతిజ్ఞ

**- ముఖ్య అతిథిగా రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి**



ధర్పల్లి (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో లిటిల్ ఆర్ట్స్ హై స్కూల్లో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో 10 కోట్ల వ్యసన విముక్తి ప్రతిజ్ఞ కార్యక్రమం ఓం శాంతి బ్రహ్మకుమారి 6 నిర్వహిస్తున్న కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిజాంబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి పాల్గొన్నారు.రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని యువత గంజాయి, డ్రగ్స్, సిగరెట్, గుట్కాకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, ప్రజలు పాల్గొని వ్యసన విముక్తి ప్రతిజ్ఞ చేశారూ ధర్పల్లిలో వ్యసన విముక్తి ప్రతిజ్ఞ ఎమ్మెల్యే భూపతిరెడ్డి యువత మత్తుకు దూరంగా ఉండాలి ఎమ్మెల్యే భూపతిరెడ్డి నషా ముక్త్ భారత్ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాల్గొన్నారు.

# ఈ నెల 16న ములుగు జిల్లాకు సీఎం రేవంత్ రెడ్డి

**ములుగు నుండే పంచాయతీరాజ్ హామ్ రోడ్ల పనులకు శ్రీకారం**

**సీఎం చేతుల మీదుగా నూతన కలెక్టరేట్ ప్రారంభం**

**అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని అధికారులకు మంత్రి సీతక్క ఆదేశం**




ములుగు(ప్రశ్నన్యూస్) రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఈ నెల 16న ములుగు జిల్లాలో పర్యటించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న పంచాయతీ రాజ్ హామ్ రోడ్ల పనులకు ముఖ్యమంత్రి ఇక్కడి నుండే శ్రీకారం చుట్టనున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవురావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా తదితరులతో కలిసి మంత్రి సీతక్క అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, సీఎం హైదరాబాద్ నుండి నేరుగా మేడారం చేరుకొని వన దేవతలను దర్శించుకుంటారని, అనంతరం ములుగు చేరుకొని పైలాన్ ను ప్రారంభిస్తారని చెప్పారు. ములుగు మండలం ఇంచర్ల గ్రామ శివారులో 7 కోట్ల రూపాయలతో నిర్మించిన ఇందిరమ్మ మహిళా శక్తి భవనాన్ని వర్చువల్ గా, నూతన కలెక్టరేట్ సముదాయ భవనాన్ని ప్రారంభిస్తారని వెల్లడించారు. జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు సంబంధించిన పనుల వివరాల జాబితాను ఈ నెల 10వ తేదీలోగా సిద్ధం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన పూర్తి షెడ్యూల్ ను ఈ నెల 12న వెల్లడిస్తామని తెలిపారు.సీఎం పర్యటన ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. మేడారం పరిసర ప్రాంతాల్లో రహదారులను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారిపై జరిమానా విధించాలని, ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.సమావేశంలో పాల్గొన్న వారు అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్ రావు, జిల్లా గ్రంధాలయ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ రఘు, రాష్ట్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ భగవాన్ రెడ్డి, ఆర్డీఓ కృష్ణవేణి, డిఆర్ఓ రవికుమార్, ఎస్ డి సి ప్రతాప్, డిప్యూటీ ట్రేని కలెక్టర్ కుషిల్ వంశీ తదితరులు.

# బాధితులకు అండగా... భరోసా కేంద్రం

**నాలుగేళ్లుగా మహిళలు, చిన్నారులకు సమన్వయంతో సేవలు**

**మరింత సమర్థవంతంగా సేవలందించాలి**

**- అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపీఎస్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల్లో బాధితులకు అండగా నిలుస్తూ.. వారికి అవసరమైన సహాయాన్ని ఒకే వేదికపై అందిస్తున్న భరోసా కేంద్రం నాలుగో వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ హాజరై కేక్ కట్ చేసి వార్షికోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. గత నాలుగు సంవత్సరాలుగా భరోసా కేంద్రం మహిళలు, చిన్నారులపై జరిగిన నేరాల బాధితులకు అండగా నిలుస్తూ, వారికి అవసరమైన కౌన్సెలింగ్, న్యాయ సహాయం, వైద్య సహాయం, పునరావాస సేవలను సమన్వయంతో అందిస్తోందన్నారు. బాధితులు నేరం జరిగిన తర్వాత ఎదుర్కొనే మానసిక ఒత్తిడి, భయాందోళనలను అధిగమించేలా వారికి ధైర్యం కల్పించడంతో పాటు, న్యాయం పొందే వరకు అవసరమైన సహకారం అందించడం భరోసా కేంద్రం ప్రధాన లక్ష్యమన్నారు.బాధితుల గోప్యత, గౌరవానికి ప్రాధాన్యతనిస్తూ సున్నితమైన విధానంతో వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. బాధితులకు సత్వర సహాయం అందేలా సంబంధిత శాఖలతో సమన్వయం చేయాలని అన్నారు.భవిష్యత్తులో కూడా ఇదే సేవా దృక్పథంతో మరింత సమర్థవంతంగా పనిచేస్తూ.. బాధితులకు వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించాలని అదనపు ఎస్పీ సూచించారు.కార్యక్రమంలో ఎస్సై సుచరిత, భరోసా కోఆర్డినేటర్ సౌమ్య, భరోసా కేంద్రం సిబ్బంది, సిబ్బంది పాల్గొన్నారు.

# సాయిబాబా ఆలయంలో సౌందర్యలహరి




మంథని ( ప్రశ్న న్యూస్) మంథని పట్టణంలోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో శుక్రవారం శ్రీ సౌందర్య లహరి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గట్టు (గొలుగుల) మాధవి బృందం ఆలపించిన ఈ కార్యక్రమం భక్తులను మంత్రముగ్ధులను చేసింది. గత రెండు సంవత్సరాలుగా పట్టణంలోని అనేకమంది మహిళలు భక్తి భావన పెంపొందించుకోవడంలో మాధవి ఎంతో తోడ్పాటును అందిస్తుంది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షురాలు మహావాది జలజ, ఆలయ అర్చకుడు శ్రీనివాస్, పట్టణంలోని మహిళా భక్తులు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతిని
# చాటిన బోనాల వేడుకలు

**మేడ్చల్ అక్షర డిగ్రీ కళాశాలలో ఘనంగా ఉత్సవాలు**




మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే బోనాల పండుగను మేడ్చల్ పట్టణంలోని అక్షర డిగ్రీ కళాశాలలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించేలా అలంకరించగా, విద్యార్థినులు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు ఎత్తుకొని అమ్మవారికి భక్తిశ్రద్ధలతో సమర్పించారు. డప్పు చప్పుళ్లు, జానపద నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో కళాశాల ప్రాంగణం కళకళలాడింది.ఈ సందర్భంగా కళాశాల సీఈఓ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ, బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పే ఆధ్యాత్మిక వేడుక అని పేర్కొన్నారు. విద్యార్థులు తమ మూలాలను, సాంస్కృతిక విలువలను పరిరక్షిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు.విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, జానపద నృత్యాలు, భక్తి గీతాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల సీఈఓ జైపాల్ రెడ్డి, చైర్మన్ భాస్కర్ రావ్,అకాడమిక్ కోఆర్డినేటర్ ప్రభాకర్,డైరెక్టర్ రాజేష్, ప్రిన్సిపల్ శిల్ప, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఫ్యూజ్ మారుస్తూ విద్యుత్ ఘాతానికి యువకుడు బలి

మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ జిల్లా ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని గుబ్బ కోల్డ్ స్టోరేజ్ లో ఫ్యూజ్ మారుస్తుండగా నాగరాజు (28) సంవత్సరాల యువకుడు విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందాడు. మృతుడు నూతనకల్ గ్రామానికి చెందిన వ్యక్తి. గ్రామంలో సెంట్రింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. లైన్ మెన్ ఆచార్య ఆదేశాల మేరకు గుబ్బ కోల్డ్ స్టోరేజ్ లో ఫ్యూజ్ మార్చేందుకు వెళ్లాడని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో ఫ్యూజ్ తొలగిస్తున్న సమయంలో విద్యుత్ ఘాతానికి గురైనట్లు సమాచారం. తీవ్రంగా గాయపడ్డ నాగరాజును ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు పేర్కొన్నారని స్థానికులు తెలిపారు.



## చేనేత కార్మికుల పొట్టగొడుతున్న కార్పొరేట్ సంస్థలు

**ముడిసరుకుకు జీఎస్టీ మినహాయించాలి. కేంద్రాన్ని డిమాండ్ చేసిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తూంకుంట అంక్షారెడ్డి**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )చేనేత పరిశ్రమ దేశ సంస్కృతికి ప్రతీక అని, అలాంటి రంగాన్ని కార్పొరేట్ సంస్థల విస్తరణ తీవ్ర సంక్షోభంలోకి నెట్టిందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు తూంకుంట అంక్షారెడ్డి అన్నారు. గజ్వేల్‌లోని మగ్గం చౌరస్తాలో జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, చేనేత కార్మికుల జీవనోపాధిని కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే ముడిసరుకుపై విధిస్తున్న జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ఆమె పేర్కొన్నారు. పండుగల సందర్భంగా మహిళలకు పంపిణీ చేసే చీరలను నేరుగా చేనేత కార్మికుల నుంచే కొనుగోలు చేయడం ద్వారా వేలాది కుటుంబాలకు ఉపాధి, ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా చేనేత కార్మికులకు పెన్షన్లు, వివిధ రాయితీలు, వార్షిక ఆర్థిక సహాయం, ఉచిత విద్యుత్, పాత విద్యుత్ బకాయిల రద్దు వంటి సంక్షేమ చర్యలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ప్రజలు కూడా చేనేత వస్త్రాలనే కొనుగోలు చేసి స్థానిక కార్మికులను ఆదుకోవాలని పిలుపునిచ్చారు. "చేనేతను ఆదరిస్తేనే కార్మిక కుటుంబాలు నిలబడతాయి. చేనేత వస్త్రాలను కొనుగోలు చేయడం ద్వారా ప్రతి ఒక్కరూ వారి జీవితాల్లో వెలుగులు నింపాలి" అని అంక్షారెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు రాజేశం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, పీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి, మజీద్ కమిటీ అధ్యక్షులు సయ్యద్ మతిన్, మాజీ కో-ఆప్షన్ సభ్యులు షరీఫ్, పద్మశాలి యువజన జిల్లా విభాగం అధ్యక్షులు ప్రేమ్ కుమార్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కొండల్ రెడ్డి, ఉడేం సారిక శ్రీనివాస్ రెడ్డి, నాగరాజు, గాడిపల్లి శ్రీనివాస్, రమేష్ గౌడ్, జగ్గయ్య గారి శేఖర్, రాములు గౌడ్, సమీర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలే శిశువుకు సంపూర్ణ ఆరోగ్యానికి పునాది

**పుట్టిన అరగంటలోపే తల్లిపాలు ఇవ్వాలి**

**- ముర్రుపాలు తొలి సహజ టీకా**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్ ) తల్లిపాలే శిశువుకు సంపూర్ణ ఆహారం, ఆరోగ్యవంతమైన జీవితానికి తొలి అడుగు" అని గజ్వేల్ మాతా శిశు సంరక్షణ కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ సుశీల రత్నం పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో నిర్వహించిన ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తల్లిపాలలో శిశువుకు అవసరమైన అన్ని రకాల పోషకాలు, విటమిన్లు, రోగనిరోధక శక్తిని పెంచే మూలకాలు సమృద్ధిగా ఉంటాయని తెలిపారు. శిశువు పుట్టిన అరగంటలోపే తల్లిపాలు ఇవ్వడం అత్యంత అవసరమని, పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాలు (కలస్ట్రమ్) సహజ యాంటీబయాటిక్, తొలి టీకాలా పనిచేసి అనేక వ్యాధుల నుంచి శిశువును రక్షిస్తాయని వివరించారు. తల్లిపాలను ఆరు నెలల వరకు తప్పనిసరిగా మాత్రమే ఇవ్వాలని, తల్లి--బిడ్డ ఆరోగ్యానికి ఇది అత్యంత కీలకమని ఆమె సూచించారు. కార్యక్రమంలో గైనకాలజిస్టులు డాక్టర్ త్రివేణి, డాక్టర్ మాధవి, శిశు వైద్య నిపుణులు డాక్టర్ శాంతం రెడ్డి, డాక్టర్ వినోద్, నర్సింగ్ సూపరింటెండెంట్ సువర్ణ, హెడ్ నర్స్ జగదాంబ, వీణ, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ వకులాదేవి, ఇన్ఫెక్షన్ కంట్రోల్ నర్సింగ్ ఆఫీసర్ రజిత, నర్సింగ్ ఆఫీసర్లు సరళ, నాగేశ్వరి, జ్యోతి, హెల్త్ అసిస్టెంట్ దేవసాని వాసుదేవ్ నేత, బి. స్వప్న, లత, దేవి, రేణుక, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఈశ్వరి భాయ్ మెమోరియల్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు, అధ్యాపకులు తల్లిపాల ప్రాముఖ్యత, కంగారూ మదర్ కేర్ విధానం, సరైన పాలిచ్చే పద్ధతులపై నాటిక రూపంలో అవగాహన కల్పించారు. ఈ ప్రదర్శన కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో బాలింతలు, గర్భిణీలు, వారి కుటుంబ సభ్యులు, పారామెడికల్ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించుకున్నారు.

## కలెక్టరేట్ లో ఘనంగా బోనాల వేడుకలు



మేడ్చల్( ప్రశ్న న్యూస్ )తెలంగాణ రాష్ట్రంలో ఆషాఢమాసంలో గ్రామ దేవతలకు భక్తి శ్రద్దలతో జరుపుకునే రాష్ట్ర పండుగ అయిన బోనాల పండుగను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ లో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని భువనేశ్వరీ మాత ఆలయంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డి ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది అందరూ కలిసి పండుగను వేడుకగా జరుపుకున్నారు. పోతరాజులతో కలిసి అధికారులు, సిబ్బంది ఎంతో ఉత్సహాంగా నృత్యవిన్యాసాలతో పాటు డప్పు వాయిద్యాల మధ్య భోనాలను కార్యాలయం నుండి ఆలయం వరకు ఉరేగింపుగా తీసుకువెళ్లారు. మహిళా సిబ్బంది అత్యంత భక్తి శ్రద్ధలతో బోనాలను అమ్మవారికి సమర్పించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతోనే మంథని సమగ్ర అభివృద్ధి సాధ్యం...

**- మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్**






మంథని ( ప్రశ్న న్యూస్) ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నాయకత్వంలోనే మంథని నియోజకవర్గం సమగ్ర అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోందని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మంథని మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారి పూర్ణ చందర్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఏఎంసీ చైర్మన్ కుడుదుల వెంకన్న, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, ఆర్టీఐ మెంబర్ మంథని సురేష్, తహసీల్దార్, ఎంపిడిఓ కె.శ్రీజా రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు రోడ్లు, రవాణా సదుపాయాల మెరుగుదల, మంథని గోదావరి నదిపై వంతెన, వెంకటాపూర్ వద్ద మానేరు నదిపై వంతెన నిర్మాణం, మంథని పట్టణంలో రోడ్ల విస్తరణ వంటి కీలక మౌలిక వసతులతో పాటు నియోజకవర్గంలో సుమారు రూ.700 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులను శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలు పూర్తయితే ప్రజలకు మరింత మెరుగైన రవాణా, మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా గత ఖరీఫ్ 2025-26 సీజన్‌లో 4,26,000 క్వింటాళ్ల వరి ధాన్యాన్ని కొనుగోలు చేయగా, ప్రస్తుత రబీ 26 సీజన్‌లో 5,05,000 క్వింటాళ్ల వరి ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులకు ఎరువులు, నాణ్యమైన విత్తనాలు, పంట రుణాలను సకాలంలో అందజేస్తూ వ్యవసాయాభివృద్ధికి సంఘం నిరంతరం కృషి చేస్తోందని వివరించారు. అదేవిధంగా గుంజపడుగు శివారులో రూ.3.40 కోట్ల వ్యయంతో పీఎం కుసుమ్ పథకం కింద సోలార్ విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కావచ్చిశీదని, త్వరలోనే విద్యుత్ ఉత్పత్తి, సరఫరా ప్రారంభం కానుందని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా సహకార సంఘానికి ఆదాయం పెరగడంతో పాటు రైతులకు పరోక్షంగా ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.
మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నాయకత్వంలో మంథని నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పన, వ్యవసాయాభివృద్ధి, ఐటీ, పరిశ్రమల విస్తరణకు మంత్రి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సీఎం అకాడమీ స్కూల్ లో బోనాల వేడుకలు

**బోనాల పండుగ విశిష్టతను చిన్నారులకు తెలియజేయడానికి ఈ వేడుకలు ప్రిన్సిపల్ కిషోర్ కుమార్**



మేడ్చల్( ప్రశ్న న్యూస్) మేడ్చల్ జిల్లా సీఎం అకాడమీ స్కూల్లో తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో చిన్నారులు సంప్రదాయ వేషధారణలో సందడి చేసి, ఆకట్టుకునే సాంస్కృతిక ప్రదర్శనలతో అందరినీ అలరించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ సిహెచ్ కిషోర్ కుమార్ మాట్లాడుతూ......తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు చేరవేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. బోనాల పండుగ మన సంస్కృతికి ప్రతీకగా నిలుస్తుందని, ఇలాంటి కార్యక్రమాల ద్వారా చిన్నారుల్లో సంప్రదాయాల పట్ల అవగాహన, గౌరవం పెంపొందుతాయని తెలిపారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం ఆనందకరమని పేర్కొన్నారు. చిన్నారులు సంప్రదాయ వేషధారణలో ఉత్సాహభరితమైన నృత్య ప్రదర్శనలు పండుగ సందడి మధ్య పల్లవి కిడ్స్ స్కూల్ ప్రాంగణం తెలంగాణ సంస్కృతి స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ కళకళలాడింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


## భక్తులకు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు.



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల్లో వంద మంది విద్యార్థుల విశేష సేవలు. శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న విజ్ఞానగిరిపై వెలసిన శ్రీ కుమారస్వామి ఆలయంలో జరుగుతున్న ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల్లో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు చెందిన 100 మంది విద్యార్థులు భక్తులకు విశేష సేవలందించారు. ఆగస్టు 6, 7 తేదీల్లో శ్రీ కుమారస్వామి వారి దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తులకు క్యూలైన్లను క్రమబద్ధీకరించడం, తాగునీరు అందించడం, దర్శన ఏర్పాట్లలో సహకరించడం వంటి సేవా కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించారు. అలాగే వైభవంగా నిర్వహించిన తెప్పోత్సవం సందర్భంగా కూడా భక్తుల రద్దీ నియంత్రణ, సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. ఈ సేవల్లో ఆర్పీబీఎస్ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, రాజీవ్‌నగర్, తెలుగుగంగ కాలనీలోని గిరిజన బాలికల సంక్షేమ ఉన్నత పాఠశాల, బాబుగ్రహారం, భాస్కర్‌పేట పురపాలక ఉన్నత పాఠశాలలకు చెందిన 100 మంది స్కౌట్స్, గైడ్స్, రోవర్లు పాల్గొన్నారు. జిల్లా కార్యాలయ కమిషనర్ టి. రమేష్ బాబు పర్యవేక్షణలో స్కౌట్ మాస్టర్లు ఎస్.కె. అజారుద్దీన్, మణికంఠ, విద్యాసాగర్, మహేంద్రతో పాటు గైడ్ కెప్టెన్లు సరిత, పద్మావతి సేవా కార్యక్రమాలను సమన్వయం చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అంకితభావంతో సేవలందించిన స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులను ఆలయ అధికారులు, భక్తులు అభినందించారు. సేవా స్ఫూర్తితో విద్యార్థులు నిర్వహించిన విధులు బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఎంతో దోహదపడ్డాయని ప్రశంసించారు.

## నేడు విద్యుత్ సరఫరా లో అంతరాయం

**గుండ్ల పోచంపల్లి విద్యుత్ శాఖ ఏఈ కె. విజయ్ కుమార్**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) నేడు విద్యుత్ సరఫరా లో అంతరాయం కలగనుందని గుండ్ల పోచంపల్లి విద్యుత్ శాఖ విజయ్ కుమార్ తెలిపారు. 11 కెవి నైబర్ ఫుడ్ ఫీడర్ 11 కెవి లక్ష్మీ నగర్ పీటర్ 11 కెవి దూలపల్లి ఫీడర్ కింద విద్యుత్ సరఫరా లో అంతరాయం కలుగనుందని ఆయన తెలిపారు. చెట్ల కటింగు,మెయింటెనెన్స్ వర్క్ దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఆయన తెలిపారు. నైబర్హుడ్ ఫీడర్ కింద ఉదయం 10 గంటల నుండి ఒంటి గంట వరకు లక్ష్మీ నగర్ ఫీడర్ కింద కూడా ఉదయం 10 గంటల నుండి ఒంటిగంట వరకు జూలపల్లి 11 కెవి లీడర్ కింద మధ్యాహ్నం నుండి 3 గంటల వరకు విద్యుత్ సరఫరాల్లో అంతరాయం కలగని ఉందని ఏ ఈ విజయ్ కుమార్ తెలిపారు. విద్యుత్తుకు అంతరాయం కలిగే ప్రాంతాలు ఒరిజిత విల్లాస్, ట్రిడెంట్ ప్రాపర్టీస్, నైబర్ హుడ్ విల్లాస్, ఏజీ సైట్ కాలనీ, శ్రీకృష్ణ అపార్ట్మెంట్స్, ఎస్సీ కాలనీ, లక్ష్మీ నగర్ మాణిక్ రెడ్డి నగర్ ఓర్జిత విలాస్ 2,3, సంజనాస్ అపార్ట్మెంట్స్,ప్రైమస్ ఇప్సిలోన్స్, ప్రెస్టేజ్ గ్రీన్ దూలపల్లి రోడ్డు, డిఆర్ఎస్ స్కూల్ ఏరియా, మురళి కృష్ణ ఎస్టేట్స్ కు విద్యుత్ సరఫరా లో అంతరాయం కలగని ఉందని ఎస్ ఈ విజయ కుమార్ తెలిపారు.


## మెడ్చల్ జిల్లాను "సురక్షిత్" కేటగిరీ జిల్లాగా తీర్చాలి

**జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్**




మేడ్చల్( ప్రశ్న న్యూస్ )ఎయిడ్స్ సురక్ష కార్యక్రమంపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశంమెడ్చల్--మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, అధ్యక్షతన ఎయిడ్స్ సురక్ష కార్యక్రమం అమలుపై జిల్లా స్థాయి సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో అమలవుతున్న హెచ్ఐవీ నివారణ, నియంత్రణ, పరీక్షలు చికిత్స సేవల పురోగతిపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. హెచ్ఐవీ నియంత్రణలో 95-95-99 లక్ష్యాల సాధన రాష్ట్ర జాతీయ స్థాయిలో అత్యంత కీలకమని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. మొదటి 95 లక్ష్యం హెచ్ఐవీతో జీవిస్తున్న వారిలో 95 శాతం మంది తమ హెచ్ఐవీ స్థితిని తెలుసుకునేలా చేయడం, రెండవ 95 లక్ష్యం నిర్ధారణ పొందిన వారిలో 95 శాతం మందిని యాంటీరెట్రోవైరల్ థెరపీ లో చేర్చడం, చివరి 99 లక్ష్యం చికిత్స పొందుతున్న వారిలో వైరల్ సప్రెషన్ సాధించేలా చేయడం అని వివరించారు. మెడ్చల్--మల్కాజిగిరి జిల్లాను "సక్షమ్ కేటగిరీ నుంచి "సురక్షిత్ కేటగిరీకి తీసుకువచ్చేందుకు జిల్లా ఎయిడ్స్ నివారణ నియంత్రణ విభాగం, ఆరోగ్య శాఖ, ఐ సి టి సి లు ఏ ఆర్ టి కేంద్రాలు భాగస్వామ్య స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా నిరంతర కృషి చేయాలని ప్రత్యేకంగా సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఆనంద్ మాట్లాడుతూ జిల్లాలో హెచ్ఐవీ నియంత్రణ కార్యక్రమాలను మరింత బలోపేతం చేసి, 95-95-99 లక్ష్యాలను నిర్ణీత గడువులో విజయవంతంగా సాధించి, మెడ్చల్--మల్కాజిగిరి జిల్లాను "సురక్షిత్" కేటగిరీ జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని సమావేశంలో సూచించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యక్రమ అధికారి (ఎయిడ్స్, కుష్ఠు) డా. వై. శ్రీదేవి, దిశా సిబ్బంది ఎం. సంజీవ్ (ప్రోగ్రామ్ మేనేజర్), కె. గణేష్ కౌన్సిలర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వివిధ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బోనాల పండుగ సందర్భంగా మద్యం దుకాణాలు బందు



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) బోనాల ఉత్సవాల సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణ కోసం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలు ప్రాంతాలలో మద్యం విక్రయాలపై తాత్కాలిక ఆంక్షలు విధించారు. ఈ నెల 9న ఉదయం 10 గంటల నుండి రాత్రి పది గంటల వరకు కళ్ళు దుకాణాలు, రెస్టారెంట్లు అనుబంధంగా ఉన్న బార్లను మూసివేయాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం రమేష్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆంక్షలు కూకట్పల్లి అల్వాల్ రాజేందర్ నగర్ జీడిమెట్ల మేడ్చల్ చందానగర్ పోలీస్ స్టేషన్లో పరిధిలో అమలులో ఉంటాయని అధికారులు తెలిపారు. స్టార్ హోటలలోను బార్లు రిజిస్టర్డ్ క్లబ్లలో నిర్వహిస్తున్న బార్లకు ఈ అంశాలు వర్తించవని ఉత్తరంలో పేర్కొన్నారు. తెలంగాణ ఎక్సైజ్ చట్టం 1968 లోని సెక్షన్ 20 ప్రకారం ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

# సీఎంఏలో మాస్టర్ మైండ్స్ మేటి

- ఆల్ ఇండియా తొలి ర్యాంకుతో ఘనవిజయం
- టాప్-10లో ఆరు ర్యాంకులు, టాప్-50లో ఏకంగా 51 ర్యాంకులు
- ఫైనల్, ఇంటర్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో సత్తా చాటిన గుంటూరు విద్యాసంస్థ



గుంటూరు( ప్రశ్న న్యూస్) కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెన్సీ (సీఎంఏ) పరీక్షల్లో మరోసారి గుంటూరు కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రముఖ విద్యాసంస్థ మాస్టర్ మైండ్స్ దేశవ్యాప్తంగా తన ప్రతిభను చాటుకుంది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ఆగస్టు 5న ప్రకటించిన సీఎంఏ ఫైనల్, సీఎంఏ ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో సంస్థ విద్యార్థులు అఖిల భారత స్థాయిలో అత్యున్నత ర్యాంకులు సాధించి విజయభేరి మోగించారు. ముఖ్యంగా సీఎంఏ ఫైనల్‌లో ఆల్ ఇండియా తొలి ర్యాంకు సాధించడం సంస్థ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లింది.సీఎంఏ ఫైనల్ విభాగంలో మాస్టర్ మైండ్స్ విద్యార్థి మట్టుపల్లి మోక్షిత్ వంశీకృష్ణ అఖిల భారత స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించి అందరి దృష్టిని ఆకర్షించాడు. ఇదే విభాగంలో మరో ఇద్దరు విద్యార్థులు మూడో, ఏడో ర్యాంకులు కైవసం చేసుకోవడంతో ఫైనల్ విభాగంలోని తొలి పది ర్యాంకుల్లోనే మూడు ర్యాంకులు మాస్టర్ మైండ్స్ ఖాతాలో చేరాయి. ప్రొఫెషనల్ కోర్సుల్లో అత్యంత కఠినంగా భావించే సీఎంఏ పరీక్షల్లో ఇలాంటి ఫలితాలు సాధించడం సంస్థ అకడమిక్ నాణ్యతకు నిదర్శనమని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.ఇంటర్మీడియట్ విభాగంలోనూ మాస్టర్ మైండ్స్ విద్యార్థులు అదే జోరు కొనసాగించారు. ఆల్ ఇండియా నాలుగో, ఎనిమిదో, తొమ్మిదో ర్యాంకులు సాధిస్తూ టాప్–10లో మరో మూడు స్థానాలను కైవసం చేసుకున్నారు. దీంతో సీఎంఏ ఫైనల్, ఇంటర్ విభాగాలను కలిపి టాప్–10లో మొత్తం ఆరు ర్యాంకులు మాస్టర్ మైండ్స్ విద్యార్థులు సాధించడం విశేషంగా నిలిచింది.ఫలితాలపై స్పందించిన మాస్టర్ మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్, ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ సీఏ మొట్టపల్లి మోహన్ మాట్లాడుతూ, ఈ విజయాలు సంస్థలో అమలు చేస్తున్న ప్రణాళికాబద్ధమైన శిక్షణకు నిదర్శనమని పేర్కొన్నారు. సీఎంఏ ఫైనల్‌లో ఆల్ ఇండియా టాప్–50లో 26 మంది, సీఎంఏ ఇంటర్మీడియట్‌లో టాప్–50లో 25 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారని తెలిపారు. మొత్తంగా రెండు విభాగాల్లో కలిపి ఆల్ ఇండియా టాప్–50లో 51 ర్యాంకులు సాధించడం మాస్టర్ మైండ్స్ చరిత్రలో మరో అద్భుత ఘట్టంగా నిలిచిందన్నారు.ఆల్ ఇండియా తొలి ర్యాంకు సాధించిన మట్టుపల్లి మోక్షిత్ వంశీకృష్ణను సీఏ మొట్టపల్లి మోహన్ ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. కృషి, పట్టుదల, క్రమశిక్షణతో చదివితే జాతీయ స్థాయిలో అత్యున్నత విజయాలు సాధించవచ్చని ఆయన ఈ సందర్భంగా విద్యార్థులకు సూచించారు.ప్రొఫెషనల్ విద్యలో నాణ్యత, నిరంతర సాధన, వ్యక్తిగత పర్యవేక్షణ, వారానికోసారి పరీక్షలు, లోపాలను గుర్తించి సరిదిద్దే ప్రత్యేక విధానం, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం వంటి అంశాలే ఈ విజయానికి ప్రధాన కారణాలని ఆయన తెలిపారు. ప్రతి విద్యార్థి సామర్థ్యాన్ని గుర్తించి వ్యక్తిగతంగా మార్గనిర్దేశం చేయడం వల్లే అత్యుత్తమ ఫలితాలు వస్తున్నాయని చెప్పారు.సీఎంఏ పరీక్షల్లో సమాన మార్కులు సాధించిన విద్యార్థులకు ఒకే ర్యాంకు కేటాయించే విధానం అమల్లో ఉంటుందని మొట్టపల్లి మోహన్ వివరించారు. అందువల్ల అధికారిక ర్యాంకుల జాబితాలో ఒకే ర్యాంకును పలువురు విద్యార్థులు పంచుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.ప్రస్తుతం పరిశ్రమలు, కార్పొరేట్ సంస్థలు, బహుళజాతి కంపెనీలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో సీఎంఏ నిపుణులకు విస్తృత అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, కాస్ట్ కంట్రోల్, కార్పొరేట్ ప్లానింగ్, ఆడిట్, టాక్సేషన్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్ వంటి కీలక రంగాల్లో సీఎంఏలకు డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోందన్నారు. అందుకే విద్యార్థులు ఇంటర్మీడియట్ దశ నుంచే ప్రొఫెషనల్ కోర్సులపై దృష్టి పెట్టాలని సూచించారు.మాస్టర్ మైండ్స్‌లో ఇంటర్మీడియట్‌తో పాటు సీఎంఏ, సీఏ, సీఎస్ వంటి ప్రొఫెషనల్ కోర్సులకు సమగ్ర శిక్షణ అందిస్తున్నామని, విద్యార్థులు ఒకేసారి అకడమిక్ విద్యతో పాటు ప్రొఫెషనల్ అర్హతలను కూడా సాధించేలా ప్రత్యేక అకడమిక్ విధానాన్ని అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. అదే సంస్థ విజయ రహస్యమని పేర్కొన్నారు.సీఎంఏ ఫలితాల్లో సాధించిన ఈ విజయాలు గుంటూరుకే కాకుండా ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణమని పలువురు విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఆల్ ఇండియా తొలి ర్యాంకుతో పాటు టాప్–10లో ఆరు ర్యాంకులు, టాప్–50లో 51 ర్యాంకులు సాధించడం ద్వారా ప్రొఫెషనల్ విద్యారంగంలో మాస్టర్ మైండ్స్ మరోసారి తన ఆధిపత్యాన్ని నిరూపించిందని ప్రశంసిస్తున్నారు.ఫలితాల సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు ఆనందం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సహచరులు అభినందించగా, సంస్థలో విజయోత్సవ వాతావరణం నెలకొంది. భవిష్యత్తులో మరిన్ని ఆల్ ఇండియా తొలి ర్యాంకులను సాధించడమే లక్ష్యంగా విద్యార్థులను తీర్చిదిద్దుతామని సంస్థ యాజమాన్యం ప్రకటించింది. ఈ ఫలితాలు ప్రొఫెషనల్ విద్యలో మాస్టర్ మైండ్స్ మరోసారి దేశవ్యాప్తంగా తన ప్రత్యేకతను చాటిన ఘన విజయంగా నిలిచాయి.

# అనుమతి లేదంటూ దీక్షకు బ్రేక్

- యడ్లపాడులో వైఎస్సార్సీపీ రిలే నిరాహార దీక్ష వద్ద ఉద్రిక్తత
- టెంట్లు తొలగించిన పోలీసులు - నినాదాలతో మార్మోగిన శిబిరం
- 'ప్రజాస్వామ్య హక్కులనే అడ్డుకుంటున్నారు' అంటూ మాజీ మంత్రి విడదల రజిని విమర్శలు



**యడ్లపాడు(ప్రశ్న న్యూస్)** డీఎస్సీ--2025 నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో భాగంగా గుంటూరు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గంలోని యడ్లపాడులో శుక్రవారం జరిగిన రెండో రోజు కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. కార్యక్రమానికి పోలీసుల అనుమతి లేదంటూ అధికారులు శిబిరాన్ని అడ్డుకోవడంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మాజీ మంత్రి విడదల రజిని ప్రసంగిస్తుండగానే పోలీసులు జోక్యం చేసుకోవడం, టెంట్లను తొలగించడం, మైక్‌లను నిలిపివేయడం, కార్యకర్తలను చెదరగొట్టేందుకు ప్రయత్నించడం వివాదానికి దారితీసింది. డీఎస్సీ అభ్యర్థులకు మద్దతుగా, ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేస్తూ వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు శాంతియుతంగా రిలే నిరాహార దీక్ష నిర్వహిస్తున్న సమయంలో పోలీసులు కార్యక్రమ స్థలానికి చేరుకున్నారు. ముందస్తు అనుమతి లేకుండా సభ నిర్వహిస్తున్నారని పేర్కొంటూ కార్యక్రమాన్ని నిలిపివేయాలని సూచించారు. దీంతో అక్కడే నాయకులు, కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. కొద్దిసేపట్లోనే టెంట్లను తొలగించడంతో పాటు మైక్ వ్యవస్థను నిలిపివేయడంతో శిబిరం వద్ద ఉద్రిక్తత మరింత పెరిగింది.పోలీసుల చర్యలను తీవ్రంగా నిరసిస్తూ వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, డీఎస్సీ అభ్యర్థులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. "పోలీస్ జులుం నశించాలి", "పోలీస్ డౌన్ డౌన్", "ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి", "నిరుద్యోగులకు న్యాయం చేయాలి" అంటూ శిబిరం ప్రాంగణం మార్మోగిపోయింది. శాంతియుతంగా జరుగుతున్న నిరసన కార్యక్రమాన్ని బలవంతంగా అడ్డుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి విడదల రజిని మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల గొంతును అణచివేసే ధోరణి అవలంబిస్తోందని ఆరోపించారు. శాంతియుతంగా నిరసన తెలియజేయడం ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు అని పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించి ముందుగానే పోలీసుల అనుమతి కోసం దరఖాస్తు సమర్పించినప్పటికీ చివరి నిమిషంలో "అనుమతి లేదు" అనే కారణంతో కార్యక్రమాన్ని అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే హక్కును కూడా హరిస్తే ప్రజాస్వామ్యం ఎలా బతుకుతుందని ప్రశ్నించారు. డీఎస్సీ--2025 నియామక ప్రక్రియపై రాష్ట్రవ్యాప్తంగా అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఈ నేపథ్యంలో పూర్తి పారదర్శకత కోసం సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని ఆమె డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువత భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆరోపిస్తూ, ఈ వ్యవహారంపై నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని కోరారు. ఉద్యోగాల కోసం సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న అభ్యర్థులకు న్యాయం చేయాలని, వారి ఆందోళనలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు.అదేవిధంగా విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఆలస్యం చేయకుండా అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలపై పోరాటాన్ని అణచివేయడానికి పోలీసులను వినియోగించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదని, ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నాలు చివరకు ప్రభుత్వానికే రాజకీయంగా నష్టం కలిగిస్తాయని హెచ్చరించారు.పోలీసులు మాత్రం శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా నిబంధనల ప్రకారమే చర్యలు తీసుకున్నామని, అనుమతి లేకుండా సభ నిర్వహించడాన్ని అనుమతించలేమని పేర్కొన్నట్లు సమాచారం. ఈ ఘటనతో యడ్లపాడులో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొనగా, అనంతరం పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఈ సంఘటన జిల్లాలో రాజకీయ చర్చకు దారితీసింది. వివిధ రాజకీయ వర్గాలు తమ తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తుండగా, డీఎస్సీ అంశం మరోసారి రాజకీయ వేడిని రాజేసింది.

# నాచారం ఈఎస్ఐ ఆసుపత్రిలో అందుబాటులోకి ఆక్యుపేషనల్ థెరపీ



**నాచారం (ప్రశ్న న్యూస్)** ప్రత్యేకమైన ఆరోగ్య సంరక్షణ విధానంలోఒకటైన ఆక్యుపేషనల్ థెరపీ విభాగాన్ని నాచారం ఈఎస్ఐ ఆసుపత్రిలో శుక్రవారం నాడు ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఎస్ఐ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతు దైనందిన జీవితంలో ఆత్మవిశ్వాసం, ఆనందమయ జీవితాన్ని పొందేలా చేయడంలో ఆక్యుపేషనల్ చికిత్సకు ఎంతో ప్రాధాన్యత ఉందని తెలుపుచు, ఈ రంగానికి విలువైన సేవలు అందించిన ఆక్యుపేషనల్ థెరపీ వృత్తి వ్యవస్థాపకులను ఘనంగా సత్కరించారు.

### ఆక్యుపేషనల్ థెరపీ ప్రత్యేకత

ఆక్యుపేషనల్ థెరపీ అనేది ఒక ప్రత్యేక పునరావాస సేవ. ఈ చికిత్సతో అన్ని వయసుల వారు తమ దైనందిన జీవితంలో మరింత ఆరోగ్యంగా, చురుకుగా మారడానికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. పక్షవాతం, గాయాలు, ఎముక విరగడం, నాడీ సంబంధిత సమస్యలు, కండరాల లోపాలు, ఇతర శారీరక లేదా మానసిక అనారోగ్య సమస్యల నుండి కోలుకుంటున్న రోగులకు ఈ చికిత్స ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆక్యుపేషనల్ థెరపిస్టులు వ్యక్తిగత చికిత్స, సహాయక పద్ధతుల ద్వారా చేతి పనితీరు, కదలిక, సమతుల్యత, స్వీయ సంరక్షణ కార్యకలాపాలు, పని నైపుణ్యంతో పాటు జీవన నాణ్యతను మెరుగుపరచుకోవడంలో ఆక్యుపేషనల్ చికిత్స ప్రత్యేకతను సంతరించుకుంది.

### ధన్యవాదాలు

నాచారం ఈఎస్ఐ ఆసుపత్రిలో ఆక్యుపేషనల్ థెరపీ విభాగాన్ని విజయవంతంగా ప్రారంభించడంలో ప్రోత్సాహం, మద్దతు అందించిన మెడికల్ సూపరింటెండెంట్, డాక్టర్. సత్యనారాయణ, ఆసుపత్రి యాజమాన్యం, వైద్యులు, నర్సింగ్ అధికారులు, సిబ్బందికి ఆక్యుపేషనల్ థెరపిస్ట్ ఎస్. ప్రేమలత హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు తోడ్పాటు అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీజీడీఏ అధ్యక్షుడు డాక్టర్ చిమా శ్రీనివాస్, ఆర్ఎంఓ–2 డాక్టర్ అశ్విన్ కుమార్, ఆర్ఎంఓ ఇన్‌చార్జ్ డాక్టర్ వీణ, డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్ సరిత, టీఎన్జీఓ అధ్యక్షుడు. వాసు, తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు. వేణు కుమార్, టీజీఎంఈ యూనియన్ ఈఎస్ఐ బ్రాంచ్ అధ్యక్షులు. విక్టోరియా, డైటీషియన్. అరుణ, బి. అరుణ, ఇతర వైద్యులు, నర్సింగ్ అధికారులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

**సంగారెడ్డి** బీరంగూడ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల్లో రూ. 8.55 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ వేగంగా విస్తరిస్తున్న నూతన కాలనీల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, వీధి దీపాలు వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుంటున్నామని, పటాన్ చెరు ను రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామని అన్నారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి అలసత్వం సహించేది లేదని, నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# పరంపర వైద్యుని ప్రతిభకు జాతీయస్థాయి గౌరవం

**భారత ప్రభుత్వ జాతీయ శిక్షణా కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌గా నారపల్లికి చెందిన ఆయుర్వేద పరిశోధకుడు సింహాచలం లక్ష్మణ స్వామి**

**ఔషధ మొక్కల విలువవృద్ధి -- పేటెంటింగ్ -- మార్కెట్ అవకాశాలపై విశేష అవగాహన కల్పించిన ఆయుర్వేద నిపుణుడు**

**విశిష్ట సేవలకు భారత ప్రభుత్వ ఐసీఎఫ్ఆర్ఈ -- అటవీ జీవవైవిధ్య సంస్థ ఘన సత్కారం**



**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలోని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా, నారాపల్లికి చెందిన ప్రముఖ ఆయుర్వేద పరిశోధకుడు, "ఆయుర్వేద పరంపర మూలిక వైద్య మహా సంఘం" వ్యవస్థాపక అధ్యక్షులు, "వీరాంజనేయ ఆయుర్వేద ఫార్మసీ" ప్రొప్రైటర్ శ్రీ సింహాచలం లక్ష్మణ స్వామి భారత ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి శిక్షణా కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌గా పాల్గొని విశేష గుర్తింపు పొందారు.హైదరాబాద్‌లోని దూలపల్లిలో గల భారత ప్రభుత్వ "ఐసీఎఫ్ఆర్ఈ -- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ బయోడైవర్సిటీ" ప్రాంగణంలో ఆగస్టు 5 నుండి 7 వరకు నిర్వహించిన "బయో వనరులను మార్కెట్ ఆవిష్కరణలుగా మలచడం -- ఎక్స్‌ట్రాక్షన్, ఉత్పత్తుల అభివృద్ధి, ఎన్‌టీఎఫ్‌పీలు మరియు ఔషధ మొక్కల పేటెంటింగ్" అంశంపై జాతీయ శిక్షణా కార్యక్రమంలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన శాస్త్రవేత్తలు, అటవీ అధికారులు, పరిశోధకులు, పారిశ్రామికవేత్తలు, శిక్షణార్థులకు ఆయన ప్రత్యేక శిక్షణ అందించారు.దాదాపు ఇరవై ఐదు సంవత్సరాలుగా ఆయుర్వేద రంగంలో సేవలందిస్తూ, అరుదైన ఔషధ మొక్కల సంరక్షణ, పరిశోధన, సాగు, విలువ ఆధారిత ఉత్పత్తుల అభివృద్ధి, ప్రజల్లో అవగాహన కల్పన వంటి రంగాల్లో విశేష కృషి చేస్తున్న శ్రీ సింహాచలం లక్ష్మణ స్వామి, వీరాంజనేయ ఆయుర్వేద ఫార్మసీ ద్వారా అనేక ఆయుర్వేద ఉత్పత్తులను అభివృద్ధి చేసి ప్రజలకు అందిస్తున్నారు. ఆయుర్వేద ఔషధాల తయారీ, పరిశోధన, సాంకేతిక అభివృద్ధి, పేటెంటింగ్ అంశాలలో ఆయనకు ఉన్న అనుభవాన్ని గుర్తించిన భారత ప్రభుత్వ సంస్థ ఈ శిక్షణా కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా ఆహ్వానించింది.శిక్షణా కార్యక్రమంలో శ్రీ లక్ష్మణ స్వామి ఆధునిక పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఔషధ మొక్కల నుండి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, పర్యావరణహిత గ్రీన్ ఎక్స్‌ట్రాక్షన్ విధానాలు, నాణ్యత ప్రమాణాలు, మార్కెట్ అవకాశాలు, మేధో సంపత్తి హక్కులు, పేటెంట్ విధానాలు, పారిశ్రామికీకరణ అవకాశాలపై సమగ్ర వివరణ అందించారు. ఆయన ప్రసంగం, ప్రదర్శన శిక్షణార్థులు, శాస్త్రవేత్తలు, అటవీ అధికారుల ప్రశంసలను అందుకుంది.అదే సందర్భంగా నూట ఐదు ఔషధ మొక్కల పూర్తి వివరాలతో రూపొందించిన భారీ సమాచార ప్రదర్శనను ఏర్పాటు చేసి, ప్రతి మొక్క యొక్క శాస్త్రీయ నామం, ఉపయోగాలు, ప్రధాన రసాయనిక పదార్థాలు, ఔషధ గుణాలు, ఆర్థిక ప్రాముఖ్యతను వివరించడం కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ ప్రదర్శనను పరిశీలించిన పలువురు శాస్త్రవేత్తలు, పరిశోధకులు అభినందనలు తెలిపారు.శ్రీ సింహాచలం లక్ష్మణ స్వామి అందించిన శిక్షణా సేవలు, శాస్త్రీయ అవగాహన, ప్రదర్శన నైపుణ్యాన్ని గుర్తించిన ఐసీఎఫ్ఆర్ఈ -- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ బయోడైవర్సిటీ అధికారులు కార్యక్రమం ముగింపు సందర్భంగా ఆయనకు ప్రత్యేక ప్రశంసా స్మారక చిహ్నాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా శ్రీ లక్ష్మణ స్వామి మాట్లాడుతూ, భారతదేశంలో లభించే అపారమైన ఔషధ మొక్కల సంపదను శాస్త్రీయ పరిశోధనతో అనుసంధానించి, విలువ ఆధారిత ఉత్పత్తులుగా అభివృద్ధి చేయడం ద్వారా రైతులు, గిరిజనులు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ప్రపంచ మార్కెట్‌లో భారత ఆయుర్వేదానికి మరింత గుర్తింపు తీసుకురావచ్చని పేర్కొన్నారు. సంప్రదాయ జ్ఞానాన్ని ఆధునిక విజ్ఞానంతో మేళవించడం ద్వారానే ఔషధ మొక్కల రంగం మరింత అభివృద్ధి చెందుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.





# ప్రభుత్వ హోమియోపతి వైద్య కళాశాల విద్యార్థిని ఆత్మహత్య

**గుడివాడ:** పట్టణంలోని ఏలూరు రోడ్డులో ఉన్న డాక్టర్ గురురాజు ప్రభుత్వ హోమియోపతి వైద్య కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న లక్ష్మి తులసి అనే విద్యార్థిని ఈ ఉదయం ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం.మృతురాలు పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురానికి చెందిన యువతిగా తెలిసింది. కళాశాల సమీపంలోని అద్దె ఇంటిలో నివసిస్తూ ప్రతిరోజూ కళాశాలకు వచ్చేదని కొందరు తోటి విద్యార్థులు తెలిపారు.

ఘటన అనంతరం భయాందోళనలకు గురైన తోటి విద్యార్థులు ఆమెకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించేందుకు నిరాకరిస్తున్నట్లు సమాచారం.ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది.

# హరిత ఆంధ్రప్రదేశ్ మిషన్‌లో భాగంగా గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో మొక్కలు నాటిన గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

**గుంటూరు,** హరిత ఆంధ్రప్రదేశ్ మిషన్ కార్యక్రమంలో భాగంగా గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటిచెప్పారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, "మానవ జీవితానికి మొక్కలు అత్యంత అవసరం. మొక్కల ద్వారా స్వచ్ఛమైన ఆక్సిజన్ లభించడంతో పాటు పర్యావరణ సమతుల్యత కూడా పరిరక్షించబడుతుంది. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో కనీసం ఒక మొక్కను నాటి, దానిని బాధ్యతగా సంరక్షించాలి" అని సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) రమణమూర్తి, ఎస్బీ డీఎస్పీ అలహరి శ్రీనివాస్, ఏఆర్ డీఎస్పీ సుంకరయ్య, ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాసరావు, నగరంపాలెం సీఐ మునిపల్లి రాజేష్, ఆర్ఐలు కృష్ణయ్య, శ్రీహరి రెడ్డి, కేబీఎం మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ విద్యార్థులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొని మొక్కలు నాటారు.హరిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యాలను విజయవంతం చేయాలంటే ప్రతి పౌరుడు పర్యావరణ పరిరక్షణలో భాగస్వామి కావాలని, మొక్కలను నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలని ఎస్పీ సూచించారు.

# 'కొరియన్ కనకరాజు' మూవీ రివ్యూ



కొంత కాలంగా కెరీర్‌లో బలమైన కమర్షియల్ సక్సెస్ కోసం ఎదురుచూస్తున్న కథానాయకుడు వరుణ్‌తేజ్. ఇప్పటి వరకు అన్ని తరహా చిత్రాలు చేసిన వరుణ్ ఈ సారి సక్సెస్ కోసం హారర్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను ఎంచుకున్నాడు. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసిందా? వరుణ్‌తేజ్‌కి ఈ సినిమా విజయాన్ని అందించిందా? అనేది సమీక్షలో తెలుసుకుందాం. కనకరాజు చెక్క భజన మండలి పేరుతో ప్రదర్శనలు ఇస్తూ ఆ డబ్బుతో కుటుంబానికి ఆర్థికంగా తోడుండే యువకుడు కనకరాజు (వరుణ్‌తేజ్). స్నేహితుడు కిష్టప్ప (సత్య) అండ్ గ్యాంగ్‌తో స్నేహం చేస్తూ, ఎమ్మెల్యే అవ్వాలని ప్రయత్నించే చెంగారెడ్డి (సునీల్) మనుషులతో గొడవలతో జీవితాన్ని గడుపుతుంటాడు. కియా కార్ కంపెనీలో పనిచేస్తూ ఎప్పటికైనా కొరియాకు వెళ్లి అక్కడే స్థిరపడాలని అనుకునే చైత్ర (రితికా నాయక్)ను చూసి తొలిచూపులోనే ప్రేమలో పడతాడు. ఇంతలో అనుకోకుండా కొరియా నుంచి రకరకాలుగా ట్రావెల్ అవుతూ వచ్చిన కొరియాకు చెందిన ఓ వస్తువు నుంచి కనకరాజు శరీరంలోకి ఓ ఆత్మ ప్రవేశిస్తుంది. అప్పట్నుంచీ కనకరాజు చేష్టలు, ప్రవర్తన వింతగా మారిపోతుంది. తనలో ఓ కొరియన్ వ్యక్తి ఆత్మ ప్రవేశించిందని తెలుసుకున్న కనకరాజు ఆ ఆత్మ కోరికలు తెలుసుకోని అవి నెరవేర్చడానికి, స్నేహితుడు కిష్టప్ప, కొరియా భాష తెలిసిన చైత్రతో కొరియాకు వెళ్లతాడు. అయితే కనకరాజుకు అక్కడికి వెళ్లాక జరిగిందేమిటి? కనకరాజు బాడీలో నుంచి ఆ ఆత్మ బయటికొచ్చిందా? కొరియాకు వెళ్లిన తరువాత తెలిసిన నిజమేమిటి? ఆ ఆత్మ నుంచి కనకరాజుకు ఎలా విముక్తి దొరికింది? అనేది మిగతా కథ. హారర్, ఎంటర్‌టైన్‌మెంట్ సినిమా నుంచి ప్రేక్షకులు ఏమీ ఆశించి వస్తారో ఫక్తుగా అలాంటి కమర్షియల్ అంశాలను జోడించి దర్శకుడు మేర్లపాక గాంధీ ఈ చిత్ర కథ,కథనాలు రాసుకున్నాడు.ప్రేక్షకులను ఎంటర్‌టైన్‌మెంట్ చేయడమే లక్ష్యంగా తెరకెక్కిన ఫక్తు కమర్షియల్ హిలేరియస్ ఎంటర్‌టైనర్ 'కొరియన్ కనకరాజు'. అయితే ప్రేక్షకులను భయపెట్టే అంశాలపై కాకుండా హిలేరియస్ ఎంటర్‌టైన్‌మెంట్‌పైనే దర్శకుడు గురిపెట్టాడు. సినిమా తొలిభాగం కాస్త స్లోగా ప్రారంభమైనప్పటికీ ఇంటర్వెల్‌కు వచ్చే సరికి కథ, కథనాలు ఆసక్తిగా మారుతాయి. సినిమా మొదట్నుంచీ ఎంటర్‌టైన్‌మెంట్‌గ బాగానే వర్కవుట్ అయ్యింది. హారర్ కామెడీ మిక్స్‌డ్ సన్నివేశాలతో ఆసక్తిని రేకెత్తిస్తూనే ఎంటర్‌టైన్‌మెంట్‌ను పంచారు. ఓ సాధారణ కథకు కొరియన్ నేపథ్యం జోడించడంతో కామెడీకి స్కోప్ పెరిగింది. ఈ అవకాశాన్ని దర్శకుడు చక్కగా సద్వినియోగం చేసుకున్నాడు. ఇక సెకండాఫ్‌లో అక్కడక్కడ సాగతీతగా అనిపించి, తడబడినా ఎంటర్‌టైన్‌మెంట్‌తో దర్శకుడు గట్టెక్కించాడు. ముఖ్యంగా సత్య కామెడీ టైమింగ్, సత్య, వరుణ్‌తేజ్ మధ్య వచ్చే సన్నివేశాలు ఆడియన్స్‌కు వినోదాన్ని పంచుతాయి. ఆత్మ కనకరాజు శరీరంలోకి ప్రవేశించినప్పటి నుండి సత్య, వరుణ్‌లు కామెడీతో నవ్వులు పూయించారు. అయితే పెంపుడు కుక్క కనిపించకపోవడం సన్నివేశంలోని ట్విస్ట్ కాస్త ఇబ్బందిగానే అనిపిస్తుంది. అక్కడ కామెడీ వర్కవుట్ అయినా అలాంటి సన్నివేశాన్ని అందరూ జీర్ణించుకోలేరు. కొరియన్ గ్యాంగ్స్‌తో చేసే యాక్షన్ సన్నివేశాలతో పాటు అక్కడి సన్నివేశాల్లో కామెడీ ఆకట్టుకుంటుంది. అయితే ఇలాంటి కథల్లో లాజిక్‌లను దర్శకులు పెద్దగా పట్టించుకోరు. తమ కన్వీనెంట్ రైటింగ్‌తో సన్నివేశాల్లో వినోదం ఎలా జొప్పించాలో, ఆ సన్నివేశాన్ని ఎలా గట్టెక్కించాలో అనేది వాళ్ల మైండ్‌లో ఉంటుంది. దర్శకుడు మేర్లపాక గాంధీ కూడా ఈ సినిమా విషయంలో అన్నీ లాజిక్‌లను విస్మరించాడు. అంతేకాదు లాజిక్‌లు ఆలోచించే సమయం కూడా ప్రేక్షకుడు ఆలోచనలో లేకుండా వినోదాన్నిపంచడంలో సక్సెస్ అయ్యాడు. వీడియో కాల్‌లో మురళీధర్ గౌడ్ చేయించే క్షుద్ర పూజలో ఉండే హిలేరియస్ కామెడీ ఈ చిత్రానికి హైలైట్.అయితే పతాక సన్నివేశాల్లో ఆత్మల ఫైట్ మాత్రం ఫోర్స్‌డ్‌గా పెట్టినట్లు అనిపిస్తుంది. అయితే కేవలం ఎంటర్‌టైన్‌మెంట్ కోసం చూసే ప్రేక్షకులు ఇలాంటి మైనస్‌లను పట్టించుకునే అవకాశం లేదు. వరుణ్‌తేజ్ సరికొత్త పాత్రలో కనిపించాడు. ఒకవైపు హాస్యాన్ని పంచుతూనే మరోవైపు ఎమోషన్, యాక్షన్ సన్నివేశాల్లో తన మార్క్ నటనను కనబరిచాడు. యాస, లుక్ కూడా కొత్తగా ఉంది. ఈ సినిమాలో ఆయన కామెడీ టైమింగ్ ఎఫ్–2లో వరుణ్ పాత్రను గుర్తుచేస్తుంది. ఇక కమెడియన్ సత్య ఈ సినిమాకు బిగ్గెస్ట్ ప్లస్. ఆయన పండించిన వినోదం ఆడియన్స్‌ను హిలేరియస్‌గా నవ్విస్తుంది. ఆయన పంచ్‌లు, కామెడీ టైమింగ్ ఈ సినిమా విజయంలో కీలక పాత్ర పోషించాయి.మురళీధర్ గౌడ్‌తో చేసిన కామెడీ కడుపుబ్బా నవ్విస్తుంది. చెంగారెడ్డి పాత్రలో విలన్‌గా కనిపిస్తూనే కామెడీ పండించాడు సునీల్. రితికా నాయక్ నటనతో అలరిస్తుంది. మురళీధర్ గౌడ్ నవ్వులు పండించాడు. తమన్ నేపథ్య సంగీతం సన్నివేశాన్ని మరింత బలంగా మార్చింది. మనోజ్‌రెడ్డి ఫోటోగ్రఫీ కథ మూడ్‌ను క్యారీ చేసింది. ట్విస్ట్‌లపై, ప్రేక్షకులను భయపెట్టే అంశాలపై కాకుండా, పూర్తి ఎంటర్‌టైన్‌మెంట్‌పై దృష్టిని పెట్టి ఈ చిత్ర కథ, కథనాలు బలంగా రాసుకున్న దర్శకుడు మేర్లపాక గాంధీ తన ప్రతిభను మరోసారి నిరూపించుకున్నాడు. నిర్మాణ విలువలు కూడా ఉన్నతంగా ఉన్నాయి. ఫైనల్‌గా లాజిక్‌లు ఆలోచించకుండా ఫన్ మ్యాజిక్‌ను ఎంటర్‌టైన్‌మెంట్ కోరుకునే ఆడియన్స్‌కు పూర్తి సంతృప్తినిచ్చే చిత్రమిది.

# నా జీవితాన్ని ఒక్కరి కోసం మార్చుకోలేను..
## పెళ్లిపై 51 ఏళ్ల అమీషా సంచలన కామెంట్స్



ఒకప్పుడు తెలుగు, హిందీ చిత్రాల్లో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న అమీషా పటేల్ మరోసారి తన వ్యక్తిగత జీవితంపై చేసిన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. 51 ఏళ్ల వయసులోనూ అవివాహితగా కొనసాగుతున్న ఆమె, పెళ్లి గురించి తన అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లడించారు. తాను ఎప్పటికీ పెళ్లి చేసుకోనని, ప్రస్తుతం సింగిల్ జీవితంతో ఎంతో సంతోషంగా ఉన్నానని చెప్పారు. తాజాగా ఎక్స్ (ట్విట్టర్) వేదికగా అభిమానులతో నిర్వహించిన 'ఆస్క్ మీ ఎనీథింగ్' (ూహీూ) సెషన్‌లో ఓ అభిమాని.. మీరు ఎప్పుడు పెళ్లి చేసుకుంటారు? అని ప్రశ్నించాడు. దీనికి ఏమాత్రం సందేహించకుండా అమీషా తన అభిప్రాయాన్ని వెల్లడించారు. నేను ఎప్పటికీ పెళ్లి చేసుకోను. సింగిల్‌గా చాలా సంతోషంగా ఉన్నాను. నన్ను ప్రేమించే కుటుంబ సభ్యులు, స్నేహితులు నాకు చాలామంది ఉన్నారు. ఒక్క వ్యక్తి కోసం నా జీవితాన్ని, నా ఆనందాన్ని పూర్తిగా మార్చుకోవాలని నేను అనుకోవడం లేదు అని ఆమె సమాధానం ఇచ్చారు. అమీషా వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆమె అభిప్రాయానికి కొందరు నెటిజన్లు మద్దతు తెలుపుతూ.. ప్రతి ఒక్కరికీ తమ జీవితాన్ని తమకు నచ్చిన విధంగా గడిపే హక్కు ఉందని కామెంట్లు చేస్తున్నారు. మరికొందరు మాత్రం పెళ్లి అనేది పరస్పర అవగాహన, ప్రేమ, సహజీవనానికి ప్రతీక అని అభిప్రాయపడుతున్నారు. గతంలో ఓ ఇంటర్వ్యూలో అమీషా పటేల్ తన ప్రేమ జీవితం గురించి కూడా మాట్లాడారు. సినీ రంగంలోకి రావడం తన అప్పటి ప్రియుడికి ఇష్టం లేకపోవడంతో ఆ బంధం ముగిసిందని ఆమె వెల్లడించారు. ఆ అనుభవం తన జీవితంలో చాలా విషయాలు నేర్పిందని చెప్పారు. అలాగే, తన కెరీర్‌ను అర్థం చేసుకుని ప్రోత్సహించే వ్యక్తి దొరికితే పెళ్లి గురించి ఆలోచించేవారినని, కానీ అలాంటి మానసిక పరిణతి ఉన్న భాగస్వామిని కనుగొనడం సులభం కాదని పేర్కొన్నారు.

వయసు కంటే వ్యక్తిత్వం, ఆలోచనా విధానమే ముఖ్యమని కూడా ఆమె అభిప్రాయపడ్డారు.అమీషా పటేల్ ఇటీవల సన్నీ డియోల్ సరసన నటించిన 'గదర్ 2' చిత్రంతో ఘన విజయాన్ని అందుకున్నారు. సకీనా పాత్రలో ఆమె నటన ప్రేక్షకులను ఆకట్టుకోగా, ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లు సాధించింది. అనంతరం 'తౌబా తేరా జల్వా' చిత్రంలో కనిపించిన అమీషా, ప్రస్తుతం తన తదుపరి ప్రాజెక్ట్‌లపై దృష్టి సారిస్తున్నారు.

# వరుస ఫ్లాపుల తర్వాత శ్రీలీలకు
# బంపర్ ఆఫర్..
## ఆ స్టార్ హీరో సరసన ఛాన్స్ దక్కిందా?



టాలీవుడ్‌లో ఒకప్పుడు వరుస అవకాశాలతో స్టార్ హీరోయిన్‌గా దూసుకెళ్లిన శ్రీలీల ఇప్పుడు కెరీర్‌లో కీలక దశను ఎదుర్కొంటోంది. 'పెళ్లి సందఢ'తో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఈ అందాల భామ, 'ధమాకా' బ్లాక్‌బస్టర్ విజయంతో ఒక్కసారిగా స్టార్ హీరోయిన్ల జాబితాలో చేరింది. తన డ్యాన్స్, ఎనర్జీ, స్క్రీన్ ప్రెజెన్స్‌తో మంచి గుర్తింపు తెచ్చుకున్నప్పటికీ, ఆ తర్వాత నటించిన పలు చిత్రాలు ఆశించిన విజయాలు సాధించకపోవడంతో కెరీర్ కాస్త నెమ్మదించింది. వరుస పరాజయాల ప్రభావంతో తెలుగులో అవకాశాలు తగ్గిన నేపథ్యంలో, శ్రీలీల ఇప్పుడు ఇతర భాషలపై దృష్టి పెట్టింది. ఇప్పటికే బాలీవుడ్‌లో కార్తీక్ ఆర్యన్ సరసన ఓ భారీ చిత్రంలో నటించే అవకాశం దక్కించుకున్న ఈ భామకు తాజాగా కోలీవుడ్ నుంచి మరో ప్రతిష్టాత్మక ఆఫర్ వచ్చినట్లు సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. తమిళ సినీ వర్గాల సమాచారం ప్రకారం, సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించనున్న ఓ భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లో శ్రీలీలను కథానాయికగా ఎంపిక చేసే దిశగా చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రజనీకాంత్ వరుస భారీ చిత్రాలతో బిజీగా ఉండగా, ఆయన లైనప్‌లో ఉన్న ప్రాజెక్ట్‌లలో ఒకదానిలో శ్రీలీల నటించే అవకాశాలు ఉన్నాయని కోలీవుడ్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్ ఖరారైతే, శ్రీలీల కెరీర్‌లో ఇది అత్యంత కీలకమైన అవకాశంగా నిలవనుంది. వరుస ఫ్లాపుల తర్వాత కూడా రజనీకాంత్ వంటి లెజెండరీ స్టార్ సరసన నటించే అవకాశం రావడం ఆమెకు మరోసారి కెరీర్‌ను గాడిలో పెట్టే ఛాన్స్‌గా భావిస్తున్నారు. ఈ సినిమా విజయం సాధిస్తే, దక్షిణాదితో పాటు బాలీవుడ్‌లోనూ శ్రీలీల క్రేజ్ మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక ప్రస్తుతం శ్రీలీల వ్యక్తిగతంగా కూడా బిజీగానే ఉంది. తన తల్లితో కలిసి పలు ప్రముఖ దేవాలయాలను సందర్శిస్తూ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటోంది. సినిమాలతో పాటు ప్రముఖ బ్రాండ్లకు సంబంధించిన వాణిజ్య ప్రకటనల్లో నటిస్తూ, తన స్కిన్‌కేర్ వ్యాపారాన్ని కూడా విజయవంతంగా నిర్వహిస్తోంది.సినిమాల విషయానికి వస్తే, తమిళంలో ఇప్పటికే 'పరాశక్తి'తో పాటు ధనుష్ హీరోగా తెరకెక్కుతున్న మరో చిత్రంలో కూడా శ్రీలీల నటిస్తోంది. ఈ సినిమాలపై కూడా మంచి అంచనాలు ఉన్నాయి. ఇప్పుడు రజనీకాంత్ ప్రాజెక్ట్ వార్తలు నిజమైతే, శ్రీలీల కెరీర్‌కు ఇది భారీ టర్నింగ్ పాయింట్‌గా మారే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడు తున్నారు.

అయితే, రజనీకాంత్ సినిమా విషయమై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో అభిమానులు అధికారిక ప్రకటన కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# నెగెటివ్ ప్రచారాన్ని
# తిప్పికొట్టాం!



దర్శకుడిగా, రచయితగా, నిర్మాతగా విజయవంతమైన సినీ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు సాయిరాజేష్. హృదయకాలేయం, కొబ్బరిమట్ట, బేబి చిత్రాలతో డైరెక్టర్‌గా.. కలర్‌ఫొటో, చెన్నై లవ్‌స్టోరీ సినిమాలతో రచయితగా సత్తాచాటారాయన. మరో నిర్మాత ఎస్‌కేఎన్‌తో కలిసి సాయిరాజేష్ నిర్మించిన 'చెన్నైలవ్‌స్టోరీ' ఇటీవలే విడుదలై బాక్సాఫీస్ వద్ద యాభైకోట్ల వసూళ్లను రాబట్టింది. ఈ నేపథ్యంలో గురువారం చిత్ర కథారచయిత, నిర్మాత సాయిరాజేష్ విలేకరులతో ముచ్చటించారు.

# కాకులు తల్వార్లు పడితే..



నాని కథానాయకుడిగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న సికింద్రాబాద్ నేపథ్య పీరియాడిక్ చిత్రం 'ది ప్యారడైజ్'. నిర్మాణ దశ నుంచే ఈ సినిమా భారీ హైప్‌ని క్రియేట్ చేస్తున్నది. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 24న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా గురువారం టీజర్‌ను విడుదల చేశారు. ఈ సినిమాలో జడల్ అనే పవర్‌ఫుల్ పాత్రలో నాని కనిపించబోతున్నారు. 'ఈ జాగా ఎవరిది? ఈ దేశమెవరిది? అంటూ నాని బిగ్గరగా నినాదాలు చేస్తూ తన వారిలో చైతన్యాన్ని రగిల్చే సన్నివేశాలతో టీజర్ ఆసక్తికరంగా మొదలైంది. ప్యారడైజ్ తాలూకు ప్రపంచాన్ని ఆవిష్కరిస్తూ తన జాతి జనుల కోసం ఆధిపత్య శక్తులతో పోరాడే యువకుడిగా నాని పాత్రను శక్తివంతంగా చూపించారు. 'అణచబడ్డ మన జాతి మర్లబడాలే..ఛీ అని ఛీదరించుకున్న నలుపురంగే మన జెండా. కాకి దానిమీద గుర్తు. కాకులు తల్వార్లు పడితే ఏమవుతుందో చూపిద్దాం' అంటూ నాని చెప్పిన సంభాషణలు టీజర్‌లో హైలైట్‌గా నిలిచాయి. ఎస్ఎల్‌వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది.

# ఫ్యామిలీ యాక్షన్ డ్రామా



విక్రమ్ సహిదేవ్, సంధ్యావశిష్ట, తారక్ పొన్నప్ప ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం'అనకాపల్లి' త్వరలో ప్రేక్షకుల ముందుకొస్తున్నది. ఖగేష్ తమ్మినేని దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని కాండ్రేగుల నాయుడు, త్రినాథరావు నక్కిన నిర్మించారు. బుధవారం ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లిలో ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నటుడు సోనూసూద్ ముఖ్యఅతిథిగా హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు అందించారు. తన సొంత ఊరు అనకాపల్లిలో ఈ వేడుక జరగడం ఆనందంగా ఉందని, ఫ్యామిలీ..యాక్షన్ అంశాల కలబోతగా ఈ సినిమా ఆకట్టుకుంటుందని నిర్మాత త్రినాథరావు నక్కిన తెలిపారు. అనకాపల్లిలోని రియల్ లొకేషన్లలో షూటింగ్ చేశామని నిర్మాత కాండ్రేగుల నాయుడు చెప్పారు. ఈ వేడుకలో చిత్రబృందమంతా పాల్గొన్నారు.

# ఆ భ్రమ నుంచి బయటపడాలి!



యాక్షన్‌తో పాటు తనదైన శైలిలో చక్కటి కామెడీని పండిస్తూ ప్రేక్షకుల్ని అలరిస్తుంటారు హీరో వరుణ్‌తేజ్. ఆయన నటించిన తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు' నేడు ప్రేక్షకుల ముందుకొస్తున్నది. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో హారర్, సూపర్‌నేచురల్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమాను తెరకెక్కించారు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్‌ఫ్రేమ్ సంస్థలు నిర్మించాయి. నాన్‌స్టాప్ ఎంటర్‌టైనర్ ఇదని, రెండున్నర గంటల పాటు ప్రేక్షకుల్ని నవ్వుల్లో ముంచెత్తుతుందని వరుణ్‌తేజ్ చెప్పారు. ఈ నేపథ్యంలో గురువారం ఆయన విలేకరులతో ముచ్చటించారు.

# వరుణయాగ సహిత సహస్రఘటాభిషేక విశేష పూజలు ప్రారంభం



శ్రీశైలం (ప్రశ్నన్యూస్) సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండి రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండాలనే సంకల్పంతో 5 రోజుల వరుణయాగ సహిత సహస్రఘటాభిషేక విశేష పూజలు శుక్రవారం ప్రారంభమయ్యాయి.ఈ పూజలు ఆగస్టు 11 వరకు కొనసాగనున్నాయి.ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం ప్రధానాలయ గోపురం నుండి పసుపు, కుంకుమ, పూలు, ఋష్యశృంగ మహర్షి చిత్రపటంతో ప్రత్యేక ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అక్కమహాదేవి అలంకార మండపంలో లోకకల్యాణాన్ని కోరుతూ అర్చకస్వాములు సంకల్పం పఠించారు.సంకల్పానంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని గణపతి పూజ చేశారు. అనంతరం ఋత్విగ్వరణం, ఋష్యశృంగజపం, వారుణానువాక పారాయణ, వరుణజపం, భాగవత, విరాటపర్వ పారాయణలు, పంచాక్షరి జపాలు నిర్వహించారు. సాయంత్రం కూడా ఇదే తరహాలో ప్రత్యేక పూజలు జరిపించనున్నారు.ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు, ధర్మకర్త జి. గంగమ్మ తో పాటు దేవస్థాన అర్చకస్వాములు, వేదపండితులు మరియు ఇతర ప్రాంతాల నుండి వచ్చిన సుమారు 36 మంది ఋత్వికులు పాల్గొన్నారు.ఈ 5 రోజుల పాటు జరిగే యాగంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్నారు.

# ఆగస్టు 10న ఆరుద్రోత్సవం

**- స్వర్ణరథంపై శ్రీస్వామి అమ్మవార్లకు విశేష పూజలు**



శ్రీశైలం (ప్రశ్నన్యూస్) 10వ తేదీన ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వర్ణరథారూఢులైన శ్రీస్వామి అమ్మవార్లకు ఆలయంలో విశేష పూజలు నిర్వహించనున్నారు.ఆ రోజు వేకువజామున శ్రీస్వామి అమ్మవార్లకు వైదికపరమైన విశేషపూజలు జరుపుతారు. అనంతరం స్వర్ణరథంపై కొలువై ఉన్న శ్రీస్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహిస్తారు. ఈ పూజలకు ముందుగా అర్చకస్వాములు లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ సంకల్పం పఠిస్తారు.అయితే ఈ నెల 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకు సకాలంలో వర్షాలు కురిసి రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండాలనే సంకల్పంతో దేవస్థానం వరుణయాగ సహిత సహస్రఘటాభిషేకం నిర్వహిస్తున్న కారణంగా, ఈ ఐదు రోజుల పాటు పురవీధులలో స్వర్ణరథోత్సవ ఊరేగింపు ఉండదని ఆలయ అధికారులు తెలిపారు.ఈ విషయాన్ని భక్తులు గమనించాలని కోరారు.

# మెడికోలపై దూసుకొచ్చిన కారు.. కఠిన చర్యలకు ఆదేశించిన : సీఎం



**అమరావతి(ప్రశ్న న్యూస్)** రాజమహేంద్రవరంలో ఇద్దరు మెడికోలను కారుతో ఢీకొట్టిన ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్రంగా స్పందించారు. ఘటనకు బాధ్యులైన నిందితులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన మెడికోలు ప్రియాంక, ఉమేష్ ఆరోగ్య పరిస్థితిపై సీఎం ఆరా తీశారు. వారి చికిత్సకు అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా ప్రియాంక ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.ఘటన వివరాలను సీఎంకు అధికారులు తెలియజేశారు. మద్యం మత్తులో కారు నడిపిన నిందితులు ఇద్దరు మెడికోలను ఢీకొట్టి పరారైనట్లు వివరించారు. అనంతరం నిందితులను పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రాణాలతో చెలగాటమాడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించరాదని స్పష్టం చేశారు. నిందితులకు చట్టం ప్రకారం కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధితులకు అవసరమైన వైద్య సహాయం పూర్తిస్థాయిలో అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

# విజ్ఞానగిరి శ్రీ కుమారస్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి.



**శ్రీకాళహస్తి (ప్రశ్న న్యూస్)** శ్రీకాళహస్తీశ్వర స్వామివారి అనుబంధ ఆలయమైన విజ్ఞానగిరిపై వెలసియున్న శ్రీ కుమారస్వామి సుబ్రహ్మణ్యేశ్వర వారి ఆడికృత్తిక మహోత్సవం సందర్భంగా శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. తెలుగుదేశం పార్టీ ప్రముఖ నాయకులు, కార్యకర్తలతో కలిసి కొండపైకి చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేసి వేదాశీర్వచనం చేశారు.క్యూ లైన్లలో భక్తులతో ముఖాముఖి పూజా కార్యక్రమాల అనంతరం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి క్యూ లైన్లలో వేచి ఉన్న భక్తుల వద్దకు వెళ్ళి మాట్లాడారు. దూరప్రాంతాల నుండి వచ్చిన భక్తులకు క్యూ లైన్లలో నీరు, మజ్జిగ, ప్రసాదాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు.దర్శన వేళలు,ఆలయ అధికారుల, మరియు సిబ్బంది,ఏర్పాట్లపై భక్తుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వేగవంతంగా దర్శనం కల్పించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, జనసేన భాజపా కూటమి నాయకులు, ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# కదలని యంత్రాంగం.. అధికారుల నిర్లక్ష్యం

- ఈ నరకయాతన తప్పేదెప్పుడు - మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడి ఇలాకలో మురుగు కంపు
- చినుకు పడితే చాలు.. అంబేద్కర్ నగర్ చౌరస్తా మురుగు చెరువు
- ఏళ్లుగా డ్రైనేజీ సమస్యతో కాలనీల ప్రజలకు చుక్కలు
- వేలాది మంది రాకపోకలకు అడ్డంకి.. - అత్యవసర సేవలకు అంతరాయం
- అధికారులకు వినతులు.. ప్రజాప్రతినిధులకు మొరలు
- కదలని యంత్రాంగం.. - అధికారుల నిర్లక్ష్యంపై మండిపడుతున్న స్థానికులు




**బోడుప్పల్ ( ప్రశ్న న్యూస్)** నగరాభివృద్ధి పేరుతో కోట్ల రూపాయల పనులు జరుగుతున్నాయని అధికారులు చెబుతున్నా,బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని అంబేద్కర్ నగర్ చౌరస్తా మాత్రం నేటికీ డ్రైనేజీ సమస్యతో అల్లాడుతోంది.చిన్నపాటి వర్షం కురిసినా చాలు... డ్రైనేజీ పొంగిపొర్లి మురుగు నీరు రోడ్డంతా వ్యాపిస్తుంది.ప్రధాన కూడలి చెరువును తలపిస్తూ రాకపోకలు స్తంభించిపోతాయి. దేవేందర్ నగర్,రాజీవ్ నగర్,అంబేద్కర్ నగర్,గౌతమ్ నగర్,మల్లయ్య నగర్,నూ అంబేద్కర్,అంబేద్కర్ నగర్ ఫేస్3 కాలనీల ప్రజలు ప్రతిసారి ఇదే నరకయాతనను అనుభవిస్తున్నారు.ఈ చౌరస్తా మీదుగానే వేలాది మంది విద్యార్థులు,ఉద్యోగులు, వ్యాపారులు,మహిళలు, వృద్ధులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు.కానీ వర్షం కురిసిన ప్రతిసారి మురుగు నీరు రోడ్డంతా కప్పేయడంతో ద్విచక్ర వాహనదారులు జారి పడుతున్నారు. పాదచారులు మురుగు నీటిలోనే నడవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ వంటి వాహనాలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఏళ్లుగా అదే కథ... మారని పరిస్థితి ప్రతి వర్షాకాలంలో ఇదే సమస్య పునరావృతమవుతున్నా శాశ్వత పరిష్కారం మాత్రం కనిపించడం లేదు. స్థానికులు ఎన్నోసార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేసినా,ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం శూన్యమేనని చెబుతున్నారు. తాత్కాలికంగా మురుగు తొలగించడం తప్ప సమస్య మూలాలను పరిష్కరించే చర్యలు చేపట్టలేదని ఆరోపిస్తున్నారు.

# పాఠశాల బస్సు బోల్తా.. ప్రాణాలు అరచేతిలో జూపూడి జాతీయ రహదారిపై గురుకుల బస్సు ప్రమాదం..

- గాయపడిన విద్యార్థులు గ్రామస్థుల సాహసంతో బయటపడ్డ చిన్నారులు..
- స్కూల్ బస్సుల భద్రతపై మళ్లీ చర్చ
- ఫిట్‌నెస్ ఉందా.? డ్రైవర్‌కు తగిన అర్హతలున్నాయా.?
- అధికారులపై ప్రశ్నల వర్షం



**ఇబ్రహీంపట్నం(ప్రశ్న న్యూస్)** ఎన్టీఆర్ జిల్లాలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకున్న గురుకుల పాఠశాల బస్సు ప్రమాదం మరోసారి విద్యార్థుల భద్రతపై ఆందోళనలను తెరపైకి తెచ్చింది. పాఠశాల ముగిసిన అనంతరం విద్యార్థులతో కేతనకొండ నుంచి బయలుదేరిన గురుకుల పాఠశాల బస్సు ఇబ్రహీంపట్నం మండలం జూపూడి గ్రామం సమీపంలోని జాతీయ రహదారిపై అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదం జరిగిన క్షణాల్లోనే బస్సులో ఉన్న విద్యార్థులు ఒక్కసారిగా కేకలు వేయడంతో అక్కడి పరిస్థితి భయానకంగా మారింది. పలువురు విద్యార్థులు గాయపడగా, మరికొందరు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన స్థానిక గ్రామస్థులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా బస్సులో చిక్కుకున్న విద్యార్థులను సురక్షితంగా బయటకు తీసి సహాయక చర్యలు చేపట్టడం పెద్ద విషాదాన్ని తప్పించిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అత్యవసర సేవల సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలను వేగవంతం చేశారు. గాయపడిన విద్యార్థులకు ప్రాథమిక చికిత్స అందించి అవసరమైన వారిని సమీప ఆసుపత్రులకు తరలించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. ప్రమాద వార్త తెలిసిన వెంటనే తల్లిదండ్రులు ఆందోళనతో ఘటనాస్థలికి, ఆసుపత్రులకు పరుగులు తీశారు. తమ పిల్లలను సురక్షితంగా చూసిన తర్వాతే వారు ఊపిరి పీల్చుకున్నారు.

### బస్సు ఎలా బోల్తాపడింది?

ప్రాథమిక సమాచారం ప్రకారం జూపూడి సమీపంలో బస్సు ప్రయాణిస్తుండగా ఒక్కసారిగా డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో వాహనం రోడ్డుపై బోల్తాపడినట్లు తెలుస్తోంది. అయితే ప్రమాదానికి అసలు కారణం ఏమిటనే దానిపై అధికారులు విచారణ చేపట్టారు. అధిక వేగం, డ్రైవర్ నిర్లక్ష్యం, సాంకేతిక లోపం, రహదారి పరిస్థితులు వంటి అన్ని కోణాల్లో పోలీసులు, రవాణా శాఖ అధికారులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. బస్సు ఫిట్‌నెస్ సర్టిఫికెట్, డ్రైవర్ లైసెన్స్, వాహన నిర్వహణ రికార్డులను కూడా పరిశీలించే అవకాశం ఉంది.

### గ్రామస్థుల సాహసం.. విద్యార్థులకు రక్షణ

ప్రమాదం జరిగిన వెంటనే జూపూడి గ్రామస్థులు ఆలస్యం చేయకుండా సంఘటన స్థలానికి చేరుకున్నారు. బస్సు కిటికీల ద్వారా, అత్యవసర ద్వారాల ద్వారా విద్యార్థులను ఒక్కొక్కరిని బయటకు తీసి సురక్షిత ప్రాంతానికి తరలించారు. కొంతమంది గాయపడిన విద్యార్థులకు అక్కడికక్కడే ప్రాథమిక చికిత్స అందించారు. అధికార యంత్రాంగం చేరుకునేలోపే గ్రామస్థులు చూపిన చొరవ మరింత ప్రాణనష్టాన్ని నివారించిందని స్థానికులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థుల సేవలను పలువురు అభినందించారు.

తల్లిదండ్రుల్లో భయం.. భద్రతపై ఆందోళన ప్రమాదం జరిగిన విషయం తెలియగానే విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. పాఠశాలలకు పిల్లలను పంపితే సురక్షితంగా ఇంటికి చేరుతారన్న నమ్మకం దెబ్బతింటోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి రోజు వందలాది మంది విద్యార్థులను తరలించే పాఠశాల బస్సుల విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని కోరుతున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పాఠశాల యాజమాన్యాలు, రవాణా శాఖ, పోలీసు అధికారులు సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది.

# శ్రావణంలోనే కొత్త ప్రసాదం పోటు ప్రారంభం

- దుర్గగుడిలో నూతన అన్నప్రసాద భవనాల ప్రారంభానికి ముమ్మర సన్నాహాలు
- విభాగాల సమన్వయంతో పనులు పూర్తి చేయాలి: ఈఓ వి.కే. శీనా నాయక్



విజయవాడ( ప్రశ్న న్యూస్) ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు నిర్మించిన అత్యాధునిక నూతన ప్రసాదం పోటు (ప్రసాద తయారీ కేంద్రం), అన్నప్రసాద భవనాల ప్రారంభానికి సన్నాహాలు వేగవంతమయ్యాయి. శ్రావణ మాసం తొలి లేదా రెండో వారంలో ఈ భవనాలను ప్రారంభించే దిశగా దేవస్థానం అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు.దేవాదాయ శాఖ నుంచి అధికారిక ఉత్తర్వులు అందిన వెంటనే, ఆలయ వేద పండితులు నిర్ణయించే శుభ ముహూర్తానికి అనుగుణంగా ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.కే. శీనా నాయక్ తెలిపారు. ఈ అంశంపై శుక్రవారం సాయంత్రం ఈవో ఛాంబర్‌లో వివిధ విభాగాల అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు.సమావేశంలో ఈవో మాట్లాడుతూ, నూతన భవనాలను భక్తులకు అందుబాటులోకి తీసుకురావడంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ఇంజినీరింగ్ విభాగం, లడ్డూ ప్రసాదం తయారీ విభాగం, అన్నప్రసాద విభాగాలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ సంయుక్త కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.ప్రారంభోత్సవానికి ముందే అన్ని యంత్రాల పనితీరు పూర్తిస్థాయిలో పరీక్షించాలని, విద్యుత్ సరఫరా, తాగునీటి సదుపాయం, పారిశుధ్యం, మౌలిక వసతులు, ప్రసాదాల తయారీ ప్రక్రియలో ఎలాంటి అంతరాయం లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. విభాగాల వారీగా పనులను కేటాయించి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.శ్రావణ మాసంలో అమ్మవారి దర్శనానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే నేపథ్యంలో, నూతన ప్రసాద తయారీ కేంద్రం ద్వారా అధిక పరిమాణంలో నాణ్యమైన ప్రసాదాలను వేగంగా తయారు చేసి పంపిణీ చేయడంతో పాటు, ఆధునిక అన్నప్రసాద భవనంలో మరింత మంది భక్తులకు సౌకర్యవంతంగా ఉచిత భోజన వసతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.వేద పండితులు ముహూర్తాన్ని ఖరారు చేసిన అనంతరం దేవాదాయ శాఖ కమిషనర్ అనుమతితో ప్రారంభోత్సవ తేదీని అధికారికంగా ప్రకటిస్తామని ఈవో వెల్లడించారు. నూతన భవనాల ప్రారంభంతో భక్తులకు మరింత వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సమీక్ష సమావేశంలో దేవస్థాన ఇంజినీరింగ్ అధికారులు, ప్రసాదం పోటు విభాగం, అన్నప్రసాద విభాగం అధికారులు, ఆలయ సూపరింటెండెంట్లు, సాంకేతిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కొత్త ప్రసాద తయారీ కేంద్రం, అన్నప్రసాద భవనాల ప్రారంభంతో ఇంద్రకీలాద్రికి వచ్చే లక్షలాది మంది భక్తులకు సేవలు మరింత మెరుగుపడనున్నాయని దేవస్థానం వర్గాలు తెలిపాయి.

# ఆధార్ ఉంటే చాలు.. చౌక బియ్యం

- రేషన్ కార్డు లేనివారికీ అవకాశం
- ధరలు తగ్గే వరకు కేంద్రాలు కొనసాగించాలి: మంత్రి నాదెండ్ల మనోహర్
- ప్రచారం పెంచాలని.. నాణ్యతపై రాజీ వద్దని అధికారులకు ఆదేశాలు



అమరావతి(ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో బియ్యం ధరలను నియంత్రించడంతో పాటు సామాన్య ప్రజలకు అందుబాటు ధరల్లో బియ్యం అందించేందుకు ప్రభుత్వం ప్రారంభించిన తక్కువ ధరకే బియ్యం విక్రయ కేంద్రాలను మరింత సమర్థంగా నిర్వహించాలని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. కేవలం రేషన్ కార్డు ఉన్నవారికే కాకుండా, ఆధార్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ కేంద్రాల ద్వారా బియ్యం కొనుగోలు చేయవచ్చని స్పష్టం చేశారు. బియ్యం ధరలు పూర్తిగా అందుబాటులోకి వచ్చే వరకు ఈ విక్రయ కేంద్రాలను కొనసాగించాలని సూచించారు.

శుక్రవారం కాకినాడ నుంచి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి, పౌర సరఫరాల శాఖ కమిషనర్ కన్నబాబు, జిల్లాల పౌర సరఫరాల అధికారులు, జిల్లా మేనేజర్లు, రైస్ మిల్లర్లతో బియ్యం విక్రయ కేంద్రాల పనితీరుపై సమీక్ష నిర్వహించారు.

మంత్రి మాట్లాడుతూ విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు వంటి ప్రధాన నగరాల్లో తెల్ల రేషన్ కార్డు లేని కుటుంబాలకు కూడా తక్కువ ధరకే బియ్యం అందించే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఆధార్ కార్డు ఆధారంగా ఒక్కో వ్యక్తికి 10 కిలోల చొప్పున బియ్యం విక్రయించే విధానాన్ని సమర్థంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

రాష్ట్రవ్యాప్తంగా చౌక బియ్యం కేంద్రాలు ప్రారంభమైన తర్వాత బహిరంగ మార్కెట్లో బియ్యం ధరలు తగ్గుముఖం పడుతున్నట్లు నివేదికలు వస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు పూర్తిస్థాయిలో ఉపశమనం కలిగే వరకు ఈ కేంద్రాలు నిరంతరాయంగా పనిచేయాలని సూచించారు.

బియ్యం నాణ్యతపై ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. అందుబాటులో ఉన్న రెండు రకాల బియ్యంపై వినియోగదారుల అభిప్రాయాలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, అవసరమైన మెరుగుదలలు చేపట్టాలని రైస్ మిల్లర్లకు సూచించారు.


అలాగే జిల్లా పౌర సరఫరాల అధికారులు, జిల్లా మేనేజర్లు స్వయంగా రైస్ మిల్లులను సందర్శించి నిల్వలు, సరఫరా పరిస్థితిని తనిఖీ చేయాలని ఆదేశించారు. కేవలం నివేదికలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ పరిస్థితిని అంచనా వేయాలని మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు.

# బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం

## - ప్రకటించిన సీఎం చంద్రబాబు

- ముసాయిదా సిద్ధమైందని చీరాలలో ప్రకటించిన ముఖ్యమంత్రి
- బీసీ వర్గాల అభ్యున్నతికి పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు స్పష్టీకరణ
- చేనేత దినోత్సవం సందర్భంగా 'నేతన్న సేవలో' పథకం కింద రూ.179 కోట్లు విడుదల






**చీరాల (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలోని వెనుకబడిన తరగతుల (బీసీల) సంక్షేమం, సంరక్షణే ధ్యేయంగా తమ కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, వారి ప్రయోజనాలను కాపాడేందుకు త్వరలోనే ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకురానున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఇప్పటికే 'బీసీ సంరక్షణ చట్టం' ముసాయిదా సిద్ధమైందని ఆయన వెల్లడించారు. శుక్రవారం బాపట్ల జిల్లా చీరాలలో 12వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. బీసీలకు చట్టబద్ధమైన రక్షణ కల్పించడమే తమ ప్రభుత్వ బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను చంద్రబాబు వివరించారు. "బీసీలకు కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా నిలుస్తుంది. వారి సంక్షేమంతో పాటు, రక్షణ కల్పించేందుకు ఈ చట్టాన్ని రూపొందిస్తున్నాం" అని ఆయన అన్నారు. కేవలం చట్టం మాత్రమే కాకుండా, వివిధ బీసీ వర్గాల అభివృద్ధికి ప్రత్యేక పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. చేపల వేట నిషేధ సమయంలో 1.34 లక్షల మత్స్యకార కుటుంబాలకు రెండేళ్లలో రూ.505 కోట్లు అందించామని, వడ్డెరలకు మైనింగ్ లీజులు, గీత కార్మికులకు ఎక్సైజ్ షాపులు కేటాయించామని గుర్తుచేశారు. అంతేకాకుండా, సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకునే బీసీలకు 3 కిలోవాట్లకు అదనంగా రూ.20 వేల సబ్సిడీ ఇస్తున్నామని వివరించారు. రాష్ట్ర ప్రజలందరికీ రూ.2.5 లక్షల విలువైన యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. అంతకుముందు, జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 'నేతన్న సేవలో' పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ పథకం కింద రాష్ట్రంలోని 71,536 అర్హులైన చేనేత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున, మొత్తం రూ.179 కోట్ల ఆర్థిక సాయాన్ని వారి ఖాతాల్లో జమ చేశారు. చేనేత వృత్తి భారతీయ సంస్కృతికి ప్రతీక అని, చేనేత కళాకారులకు తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, సంక్షేమం-అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీపడటం లేదని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. గత పాలనలో దెబ్బతిన్న రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెడుతున్నామని, పెట్టుబడులను ఆకర్షించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. అమరావతి నిర్మాణంతో రాష్ట్రానికి 'బ్రాండ్ ఇమేజ్' తీసుకువస్తుంటే, కొందరు 'గొడ్డలి జనరేషన్' కుట్రలతో అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. అలాంటి వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సవిత, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# న్యాయం అడిగితే కేసులా.?

- కూలి బకాయిల కోసం రోడ్డెక్కిన గిరిజనులపై ఎఫ్ఐఆర్
- కాంట్రాక్టర్‌పై చర్యలు కోరిన బాధితులు,
- పోలీసుల తీరుపై ప్రజా సంఘాల ఆగ్రహం



**ఇబ్రహీంపట్నం(ప్రశ్న న్యూస్)** కూలి బకాయిలు ఇప్పించాలని డిమాండ్ చేస్తూ రోడ్డెక్కిన గిరిజనులపై పోలీసులు కేసు నమోదు చేయడం వివాదానికి దారితీసింది. కాంట్రాక్టర్ తమకు పూర్తి కూలి చెల్లించలేదని ఆరోపిస్తూ న్యాయం కోసం నిరసన చేపట్టిన బాధితులపైనే కేసులు నమోదు చేయడంపై ప్రజా సంఘాలు, గిరిజన సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.జి.కొండూరు మండలం కట్టుబడిపాలెం గ్రామానికి చెందిన బాణావత్ రాజు నాయక్, మరికొందరు గిరిజనులు సుగాలి సంప్రదాయ దుస్తులు ధరించి మహిళలతో కలిసి విజయవాడ ఇంద్రకీలాద్రి వరకు పాదయాత్ర చేపట్టారు. తాము కాంట్రాక్టర్ వద్ద పనిచేసినా పూర్తి కూలి చెల్లించలేదని ఆరోపిస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. బాధితుల వాదన ప్రకారం, పలుమార్లు అడిగినా బకాయిలు చెల్లించకపోవడంతో చివరి మార్గంగా నిరసనకు దిగాల్సి వచ్చిందని తెలిపారు.శుక్రవారం ఉదయం ఇబ్రహీంపట్నం మండలం తుమ్మలపాలెం సమీపంలోని జాతీయ రహదారిపై కొంతసేపు బైఠాయించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చి, ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగించారనే అభియోగాలతో సంబంధిత వ్యక్తులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.అయితే ఈ చర్యపై ప్రజా సంఘాలు, గిరిజన సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. కూలి బకాయిలు చెల్లించలేదనే ఆరోపణలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సింది పోయి, న్యాయం కోరిన వారిపైనే కేసులు నమోదు చేయడం అన్యాయమని విమర్శిస్తున్నాయి. బాధితుల ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు వెలికితీయాలని, కూలి బకాయిలు ఉంటే వెంటనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.కొన్ని ప్రజా సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ, బాధితుల సమస్యను పరిష్కరించే దిశగా ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించాలని కోరారు. పోలీసుల చర్యలను నిరసిస్తూ ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు దళిత, గిరిజన, ప్రజా సంఘాలు చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు.మరోవైపు, పోలీసులు మాత్రం జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ను అడ్డుకోవడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగాయని, చట్ట ప్రకారం కేసు నమోదు చేసినట్లు పేర్కొంటున్నారు. కూలి బకాయిలపై వచ్చిన ఆరోపణలు వేరే అంశమని, వాటిపై చట్టబద్ధంగా ఫిర్యాదు చేస్తే తగిన విచారణ జరుగుతుందని చెబుతున్నారు.

# భాగ్యనగర్ అమ్మవార్లకు ఇంద్రకీలాద్రి నుంచి పట్టువస్త్రాలు

- బోనాల ఉత్సవాల సందర్భంగా ఎనిమిది ఆలయాలకు ప్రత్యేక సమర్పణ
- రెండు తెలుగు రాష్ట్రాలు సుభిక్షంగా వర్ధిల్లాలని ఆకాంక్ష



**విజయవాడ/హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** తెలంగాణలో జరుగుతున్న బోనాల మహోత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లోని భాగ్యనగర్ అమ్మవార్ల ఆలయాలకు విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ కనకదుర్గమ్మ వారి సన్నిధి నుంచి శుక్రవారం పట్టువస్త్రాలను ఘనంగా సమర్పించారు. రెండు తెలుగు రాష్ట్రాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది సుభిక్షంగా వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ ఈ ప్రత్యేక సమర్పణ చేపట్టినట్లు శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ) తెలిపారు. బోనాల జాతర సందర్భంగా హైదరాబాద్ ఉమ్మడి దేవాలయాల పరిధిలోని ఉప్పుగూడ శ్రీ మహంకాళీ ఆలయం, లాల్‌దర్వాజా శ్రీ సింహవాహిని మహంకాళీ ఆలయం, గౌలిపురా శ్రీ మహంకాళీ ఆలయం, సుల్తాన్‌షాహి శ్రీ జగదాంబ ఆలయం, హరిబౌలి శ్రీ బేల ముత్యాలమ్మ ఆలయం, శ్రీ బంగారు మైసమ్మ ఆలయం, శ్రీ అక్కన్న--మాదన్న ఆలయం, మీర్‌ఆలం మండి శ్రీ మహంకాళేశ్వర ఆలయం దేవతామూర్తులకు పట్టువస్త్రాలు సమర్పించారు.హైదరాబాద్ ఉమ్మడి దేవాలయాల కమిటీ ప్రతినిధులు విజయవాడ నుంచి వచ్చిన దేవస్థానం ప్రతినిధి బృందానికి ఘన స్వాగతం పలికి, ఆయా ఆలయాలకు తీసుకెళ్లి కార్యక్రమాన్ని నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రత్యేక పూజలు, మంగళవాయిద్యాల నడుమ పట్టువస్త్రాల సమర్పణ జరిగింది.ఈ సందర్భంగా ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ మాట్లాడుతూ, తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, ఆధ్యాత్మిక బంధం మరింత బలపడాలని అమ్మవారిని ప్రార్థిస్తూ ఈ పట్టువస్త్రాలు సమర్పించినట్లు తెలిపారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు రెండు రాష్ట్రాల మధ్య సాంస్కృతిక, భక్తి సంబంధాలను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకులు ఎల్. దుర్గాప్రసాద్, ధర్మకర్తల మండలి సభ్యులు బడేటి ధర్మారావు, అవ్వారు శ్రీనివాసరావు, టి. హరికృష్ణ, పి. రాఘవరాజు, టి. వెంకట రమణారావు, వేదపండితులు, సూపరింటెండెంట్ డి.వి.వి. సత్యనారాయణ, ఫెస్టివల్ సెక్షన్ గుమస్తా పి. శిరీష తదితరులు పాల్గొన్నారు.

### గజ్వేల్--జాలిగామ రహదారి

# గుంతలమయం

- ప్రాణాలకు ముప్పుగా మారిన ప్రధాన రహదారి..
- నరకయాతన అనుభవిస్తున్న వాహనదారులు
- ప్రమాదాల పరంపర కొనసాగుతున్నా స్పందించని అధికారులు
-- యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ప్రజల డిమాండ్



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** సిద్దిపేట జిల్లా గజ్వేల్ నుంచి జాలిగామకు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయంగా మారి వాహనదారులకు శాపంగా మారింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు తోడు రహదారికి సరైన నిర్వహణ లేకపోవడంతో భారీ గుంతలు ఏర్పడి, ప్రతి రోజు ప్రమాదాలకు వేదికగా మారుతోంది.ద్విచక్ర వాహనదారులు గుంతలను గమనించలేక కిందపడుతూ తీవ్ర గాయాల పాలవుతున్నారు. ఆటోలు, కార్లు, ఇతర వాహనాలు తరచూ దెబ్బతింటుండటంతో వాహనదారులు ఆర్థికంగా నష్టపోతున్నారు. వర్షపు నీటితో గుంతలు కనిపించక ప్రమాదాల ముప్పు మరింత పెరిగిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ రహదారిపై ప్రయాణించేందుకు ప్రజలు భయపడే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, గర్భిణులు, అత్యవసర వైద్యం కోసం గజ్వేల్‌కు వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ సమస్యపై పలుమార్లు వివిధ పత్రికల్లో వార్తలు వచ్చినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి యుద్ధప్రాతిపదికన రహదారి మరమ్మతులు చేపట్టి, తాత్కాలికంగానైనా గుంతలను పూడ్చి ప్రమాదాలను నివారించాలని జాలిగామ గ్రామస్తులు, 16వ వార్డు ప్రజలు, వాహనదారులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

# ఫార్చ్యూన్ ఆయిల్ కంపెనీకి భారీ జరిమానా

## - నాణ్యత పరీక్షల్లో ఫెయిల్!




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రముఖ వంట నూనెల బ్రాండ్ ఫార్చ్యూన్ తయారీ సంస్థ, ఏడబ్ల్యూఎల్ అగ్రి బిజినెస్ లిమిటెడ్‌కు భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) జరిమానా విధించింది. ఫార్చ్యూన్ బ్రాండ్‌కు చెందిన సన్‌ఫ్లవర్ ఆయిల్‌లో నిర్దేశిత నాణ్యత ప్రమాణాలు లోపించాయని నిర్ధారణ కావడంతో ఈ చర్యలు చేపట్టింది. గోవాలోని తాజ్ ఫోర్ట్ అగ్వాడా రిసార్ట్ అండ్ స్పా నుండి సేకరించిన ఒక లీటర్ 'ఫార్చ్యూన్ ప్రయోలా' రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ నమూనాను ఎఫ్ఎస్ఎస్ఏఐ ల్యాబ్‌లో పరీక్షించారు. ఈ పరీక్షల్లో నూనెలో ఉండాల్సిన విటమిన్-ఏ, విటమిన్-డి స్థాయిలు నిర్దేశిత పరిమితుల కంటే గణనీయంగా తక్కువగా ఉన్నట్లు తేలింది. దీంతో ఆహార భద్రతా, ప్రమాణాల చట్టం-2006 ప్రకారం, ఈ ఉత్పత్తిని 'నాణ్యతలేనిది'గా అధికారులు వర్గీకరించారు.

ఈ ఫలితాలపై సదరు సంస్థ అప్పీల్ చేయడంతో, ఆ నమూనాను మరో రిఫరల్ ల్యాబొరేటరీలో పునఃపరీక్షించారు. రెండోసారి నిర్వహించిన పరీక్షల్లోనూ విటమిన్-డి స్థాయి తక్కువగా ఉన్నట్లు ధ్రువీకరణ కావడంతో ప్రాసిక్యూషన్‌కు అనుమతి లభించింది. ఈ నేపథ్యంలో, గోవాలోని అడ్జుడికేటింగ్ అధికారి కంపెనీపై జరిమానా విధించారు. అయితే, జరిమానా మొత్తాన్ని అధికారులు ఇంకా వెల్లడించలేదు. ఈ అంశంపై ఏడబ్ల్యూఎల్ అగ్రి బిజినెస్ స్పందిస్తూ, తమకు ఇంకా అధికారిక ఉత్తర్వుల కాపీ అందలేదని పేర్కొంది. ఇది కేవలం విటమిన్ల స్థాయికి సంబంధించిన అంశమేనని, ఉత్పత్తి భద్రతకు ఎలాంటి ఢోకా లేదని, ఈ నూనె వినియోగానికి పూర్తి సురక్షితమని స్పష్టం చేసింది. నిల్వ చేసే విధానం, కాంతి, కాలపరిమితి వంటి కారణాల వల్ల విటమిన్ల స్థాయి మారే అవకాశం ఉంటుందని అభిప్రాయపడింది. ఆర్డర్‌ను సమీక్షించిన అనంతరం తదుపరి న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని, ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనలకు తాము కట్టుబడి ఉన్నామని సంస్థ వివరించింది. ఆహార భద్రతా నిబంధనలను ఉల్లంఘిస్తున్న సంస్థలపై ఎఫ్ఎస్ఎస్ఏఐ ఇటీవల కఠిన చర్యలు తీసుకుంటున్న తరుణంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది.

# షేక్ హసీనా వ్యాఖ్యలతో మాకు సంబంధం లేదు

## - భారత్ స్పష్టీకరణ



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ఇటీవల నిర్వహించిన వర్చువల్ మీడియా సమావేశంతో తమకు ఎటువంటి సంబంధం లేదని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఆ కార్యక్రమంలో, ముఖ్యంగా ఢాకాలోని ప్రస్తుత ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలను తాము సమర్థించబోమని భారత్ తేల్చిచెప్పింది. న్యూఢిల్లీలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ ఈ విషయాలను వెల్లడించారు. బుధవారం జరిగిన సదరు కార్యక్రమాన్ని ఒక ప్రైవేట్ మీడియా సంస్థ నిర్వహించిందని, ఇందులో భారత ప్రభుత్వ ప్రమేయం ఏమీ లేదని ఆయన స్పష్టం చేశారు. "బంగ్లాదేశ్‌లో చట్టబద్ధంగా ఏర్పాటైన ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలను మేము ఏమాత్రం సమర్థించం" అని జైస్వాల్ పేర్కొన్నారు.బుధవారం న్యూఢిల్లీ నుంచి ఆడియో లింక్ ద్వారా నిర్వహించిన సమావేశంలో షేక్ హసీనా ప్రసంగించారు. బంగ్లాదేశ్‌లో గత రెండేళ్లుగా పరిస్థితులు అత్యంత దారుణంగా ఉన్నాయని, ప్రజలు భయం, అభద్రత, ఆర్థిక ఇబ్బందుల మధ్య జీవిస్తున్నారని ఆమె ఆరోపించారు. బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ రిగ్గింగ్ ద్వారా అధికారంలోకి వచ్చిందని విమర్శించిన ఆమె, ఈ ఏడాది చివరి నాటికి తాను తిరిగి బంగ్లాదేశ్‌కు వెళతానని తెలిపారు. షేక్ హసీనా వ్యాఖ్యలపై బంగ్లాదేశ్ ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో భారత్ ఈ మేరకు స్పందించింది. పొరుగు దేశాల్లోని పరిణామాలను నిశితంగా గమనిస్తున్నామని, జాతీయ భద్రతా ప్రయోజనాల పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని రణధీర్ జైస్వాల్ పునరుద్ఘాటించారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588